




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 1 సంచిక : 163 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : తాడేపల్లిగూడెం శుక్రవారం 24 ఏప్రిల్ 2026 వెల : 1/-రూ ॥


VOLUME :1 ISSUE : 163 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM FRI 24 APRIL 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


### అక్రమ చొరబాటుదారుల ఆట కట్టిస్తాం..

## బెంగాల్‌ను విముక్తం చేయండి

- హుగ్లీ జిల్లా బాలాగర్ లో అమిత్ షా బహిరంగసభ
- బెంగాల్ లో బీజేపీ ప్రభుత్వం రాగానే అక్రమ చొరబాటుదారుల ఆట కట్టిస్తామన్న అమిత్ షా
- మే 5వ తేదీతో మమతా బెనర్జీ పాలన ముగుస్తుందని ధీమా



**పెన్ పవర్ డెస్క్:**పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో హుగ్లీ జిల్లా బాలాగర్‌లో కేంద్ర హోం మంత్రి అమిత్ షా భారీ బహిరంగసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర భద్రత, ఆర్థిక వ్యవస్థపై అక్రమ వలసల ప్రభావాన్ని ఎండగట్టారు. బెంగాల్‌లో బీజేపీ ప్రభుత్వం రాగానే ఒక్కరిని కూడా

- మిగతా 2లో



## టార్గెట్లు కాదు.. భద్రతే ముఖ్యం

### బ్యాంకులకు హైదరాబాద్ సీపీ సజ్జనార్ కీలక ఆదేశాలు

- సైబర్ మోసాల కట్టడిపై బ్యాంకులతో హైదరాబాద్ సీపీ సజ్జనార్ ఉన్నతస్థాయి సమావేశం
- 'జీరో మూల్ అకౌంట్లు' లక్ష్యంగా పనిచేయాలని బ్యాంకులకు ఆదేశం
- అకౌంట్ల సంఖ్య కన్నా పౌర భద్రతకే ప్రాధాన్యం ఇవ్వాలని సూచన
- మోసాలకు సహకరించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరిక
- విదేశాల కేంద్రంగా సైబర్ మోసాలు.. బ్యాంకు అధికారుల పాత్రపై సీపీ ఆందోళన

2లో

### తమిళనాడు, బెంగాల్ లో ముగిసిన పోలింగ్...

## రికార్డు స్థాయిలో ఓటింగ్ నమోదు



- సాయంత్రం 5 గంటలకే తమిళనాడులో 82.24%, బెంగాల్‌లో 89.93% ఓటింగ్
- కన్యాకుమారిలో పడవల్లో డ్యామ్ దాటి వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్న గిరిజనులు
- 2021 ఎన్నికల నాటి పోలింగ్ శాతాన్ని అధిగమించిన రెండు రాష్ట్రాలు
- డీఎంకే కూటమి 200కు పైగా సీట్లు గెలుస్తుందని ఎండీఎంకే నేత వైగో ధీమా

- మిగతా 2లో

### జగన్ నివాసానికి వెళ్లి ఆశీస్సులు అందించిన

## ఒంటిమిట్ట అర్చకులు... టీటీడీ ఫైర్

- ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయ అర్చకులకు టీటీడీ షోకాజ్ నోటీసులు
- మాజీ సీఎం జగన్ నివాసానికి వెళ్లి వేదాశీర్వచనం అందించడమే కారణం
- ఆలయ నిబంధనలను ఉల్లంఘించారని అర్చకులపై టీటీడీ ఆగ్రహం
- రెండు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని నోటీసుల్లో స్పష్టం
- సమాధానం సంతృప్తికరంగా లేకపోతే కఠిన చర్యలని హెచ్చరిక




**పెన్ పవర్ డెస్క్:**ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామి ఆలయానికి చెందిన ముగ్గురు అర్చకులపై తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆలయ నిబంధనలకు విరుద్ధంగా, పులివెందులలో మాజీ సీఎం జగన్ నివాసానికి వెళ్లి ఆయనకు వేదాశీర్వచనం అందించినందుకు గాను వారికి షోకాజ్ నోటీసులు జారీ చేసింది. టీటీడీ పరిధిలో ఉన్న

- మిగతా 2లో

# హరిత, నీలి నగరంగా అమరావతిని నిర్మిస్తాం

- అమరావతి పనులకు మళ్లీ ఊపు.. కీలక నిర్ణయాలు తీసుకున్న చంద్రబాబు
- ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన 60వ సీఆర్డీఏ అథారిటీ సమావేశం
- కృష్ణానదిపై ఐకానిక్ బ్రిడ్జి నిర్మించాలని అధికారులకు ఆదేశం
- ఏపీలో మళ్లీ పెట్టుబడులపై విశ్వాసం పెరిగిందన్న ముఖ్యమంత్రి
- ప్రతిష్టాత్మక విద్యా సంస్థలతో అమరావతి విద్యా కేంద్రంగా మారుతుందని వ్యాఖ్య

**పెన్ పవర్ డెస్క్:**ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన 60వ సీఆర్డీఏ (రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ) అథారిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి పురపాలక, సీఆర్డీఏ, ఆర్థిక, అటవీ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు హాజరయ్యారు. రాజధాని నిర్మాణానికి సంబంధించిన పలు కీలక ప్రతిపాదనలపై ఈ సమావేశంలో చర్చించారు. అమరావతిని ప్రపంచంలోనే ఓ అత్యుత్తమ హరిత, నీలి (గ్రీన్ అండ్ బ్లూ) నగరంగా, నివాసయోగ్యమైన (లివబుల్) నగరంగా నిర్మిస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థలకు అమరావతి నగరం నిలయంగా మారుతుందని చంద్రబాబు పేర్కొన్నారు. బిట్స్ పిలాని వంటి క్యాంపస్‌ల ఏర్పాటుతో ఇది కీలకమైన విద్యా కేంద్రంగా రూపుదిద్దుకుంటుందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వంపై పెట్టుబడిదారులకు మళ్లీ విశ్వాసం కలిగిందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఇందులో భాగంగానే రెన్యూ ఎనర్జీ వంటి సంస్థలు ఇంగాట్ సోలార్ వేఫర్ ఉత్పత్తి కోసం అనకాపల్లిలో యూనిట్ ఏర్పాటు చేస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. రాజధాని నగరాన్ని అనుసంధానిస్తూ కృష్ణా నదిపై నిర్మించే వంతెనను అత్యంత ఆకర్షణీయంగా, ఓ ఐకానిక్ నిర్మాణంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. రాజధాని నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఈ సమావేశంలో నిర్ణయించారు.



### పెట్రోల్, డీజిల్ ధరల పెంపు వుండదు..

## కేంద్రం కీలక ప్రకటన

- ఎన్నికల తర్వాత పెట్రోల్, డీజిల్ ధరల పెంపు లేదన్న కేంద్రం
- ధరల పెంపు వార్తలు అవాస్తవం, దురుద్దేశపూర్వకమని వెల్లడి
- గడిచిన నాలుగేళ్లుగా ధరలు పెంచని ఏకైక దేశం భారతేనని స్పష్టీకరణ
- అంతర్జాతీయంగా చమురు ధరలు పెరుగుతున్నా భారత్‌లో స్థిరంగానే రేట్లు

**పెన్ పవర్ డెస్క్:**పశ్చిమ బెంగాల్, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల తర్వాత దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతాయంటూ వస్తున్న మీడి యా కథనాలపై కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ స్పందించింది. ఈ వార్తలను 'దురుద్దేశపూర్వకమైనవి, తప్పుదోవ పట్టించేవి'గా అభివర్ణిస్తూ కొట్టిపారేసింది.




- మిగతా 2లో




### అనకాపల్లిని మరో రంగారెడ్డి

## జిల్లాగా తీర్చిదిద్దుతాం

- రాంబిల్లిలో రూ.5,400 కోట్లతో రెన్యూ సోలార్ ప్లాంట్‌కు శంకుస్థాపన
- రాష్ట్రంలో 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యమని వెల్లడి
- గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ వ్యవస్థ ధ్వంసమైందని విమర్శ
- విద్యుత్ ఛార్జీలు పెంచబోమన్న హామీకి కట్టుబడి ఉన్నామని స్పష్టీకరణ

- మిగతా 2లో

### జయమంగళ వెంకటరమణ రాజీనామా తిరస్కరించిన ఏపీ శాసనమండలి ఛైర్మన్

- ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ రాజీనామా తిరస్కరణ
- నిర్ణయం తీసుకున్న మండలి ఛైర్మన్ మోషేన్ రాజు
- రాజీనామాపై హైకోర్టు ఆదేశాలతో నిర్ణయం వెల్లడి
- సమాధానం సంతృప్తికరంగా లేదన్న ఛైర్మన్
- యథాతథంగా కొనసాగనున్న జయమంగళ ఎమ్మెల్సీ పదవి


- మిగతా 2లో



### తెలంగాణలో నేటి నుంచే వేసవి సెలవులు

- తెలంగాణలోని అన్ని పాఠశాలలకు నేటి నుంచి 50 రోజుల పాటు వేసవి సెలవులు
- సెలవులు ప్రకటిస్తూ తెలంగాణ విద్యాశాఖ ఉత్తర్వులు
- ఏప్రిల్ 24 నుంచి జూన్ 11 వరకు వేసవి సెలవులు
- జూన్ 12న తిరిగి ప్రారంభంకానున్న పాఠశాలలు

- మిగతా 2లో



### అనంతబాబుకు సమాచారం అందించినట్లు ఆరోపణలు.. సీఐపై వేటు

- డ్రైవర్ హత్య కేసులో ఏ1గా ఉన్న ఎమ్మెల్సీ అనంతబాబు
- కేసు దర్యాప్తు సమాచారాన్ని ఆయనకు అందించినట్లు సీఐ రవికుమార్ పై ఆరోపణలు
- వీఆర్ కు పంపుతూ ఉత్తర్వులు జారీ చేసిన ఏలూరు రేంజ్ ఐజీ

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

### హర్మూజ్ జలసంధిలో 'డిజిటల్' బాంబు.. ఇరాన్ తదుపరి టార్గెట్ డేటా కేబుల్స్..?

ఒకప్పుడు యుద్ధాలు కేవలం సరిహద్దుల్లో ఆయుధాలతో జరిగేవి.. కానీ ఇప్పుడు 'డిజిటల్' రూపం సంతరించుకున్నాయి. చమురు సరఫరా అడ్డుకోవడం ద్వారా ప్రపంచాన్ని వణికించిన ఇరాన్, ఇప్పుడు 'సముద్రగర్భ డేటా కేబుల్స్'పై దృష్టి సారించిందన్న వార్త ఆధునిక ప్రపంచానికి వెన్నులో వణుకు పుట్టిస్తోంది. చమురు లేకపోతే బండ్లు ఆగుతాయి, కానీ డేటా లేకపోతే దేశాలే ఆగిపోతాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ఫిజికల్ వార్ నుంచి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వార్‌గా మారుతుంది. హర్మూజ్ జలసంధి కేవలం నౌకలు వెళ్లే దారి మాత్రమే కాదు, అది ప్రపంచాన్ని కలిపే డిజిటల్ హైవే కూడా. ఇరాన్ మీడియా నుంచి అందుతున్న సంకేతాల ప్రకారం.., అమెరికా, ఇజ్రాయెల్ దేశాలను దెబ్బతీయడానికి ఇరాన్ ఇప్పుడు 'సముద్రగర్భ కేబుల్స్'ను ఆయుధంగా వాడుకోవాలని చూస్తోంది. ఇది జరిగితే, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఊహించని విపత్తును ఎదుర్కోవాల్సి ఉంటుంది. మనకు ఇంటర్నెట్ శాటిలైట్ల ద్వారా వస్తుందని చాలా మంది అనుకుంటారు. కానీ వాస్తవానికి 95 శాతానికి పైగా అంతర్జాతీయ డేటా ట్రాఫిక్ సముద్రం అడుగున ఉండే కేబుల్స్ ద్వారానే సాగుతుంది. గల్ఫ్ దేశాలను యూరప్, ఆసియాతో కలిపే అనేక ప్రధాన కేబుల్ వ్యవస్థలు హర్మూజ్ జలసంధి గుండా వెళ్తాయి. అంతర్జాతీయ బ్యాంకింగ్ లావాదేవీలు, క్లౌడ్ డేటా స్టోరేజ్, గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, ప్రభుత్వాల మధ్య కమ్యూనికేషన్ అంతా ఈ కేబుల్స్ పైనే ఆధారపడి ఉంటుంది.

**అసలు వ్యూహం ఇదేనా?**

చమురు ట్యాంకర్లను అడ్డుకోవడం వల్ల ఇరాన్ ఇప్పటికే ప్రపంచ దేశాల ఆగ్రహానికి గురైంది. ఇప్పుడు డేటా కేబుల్స్ ను లక్ష్యంగా చేసుకోవడం ద్వారా మరింత ఒత్తిడి తీసుకురావాలని చూస్తోంది. ఈ కేబుల్స్ సముద్రం అడుగున కొన్ని అడుగుల లోతులో ఉంటాయి. ఒక చిన్న లంగరు ద్వారా లేదా ఉద్దేశపూర్వకంగా సబ్‌మెరైన్లతో వీటిని కట్ చేయడం చాలా సులభం. ప్రధాన కేబుల్స్ దెబ్బతింటే, పెర్షియన్ గల్ఫ్ దేశాల్లో ఇంటర్నెట్ పూర్తిగా స్తంభించిపోతుంది. బ్యాంకింగ్ సర్వీసులు ఆగిపోయి, ప్రజలు నగదు విత్‌డ్రా చేసుకోలేక, ఆన్‌లైన్ పేమెంట్స్ చేయలేక గందరగోళం నెలకొంటుంది. ఇరాన్ గనుక ఈ డేటా యుద్ధానికి దిగితే, అది కేవలం అమెరికా–ఇజ్రాయెల్ దేశాలనే కాదు, మొత్తం ప్రపంచాన్ని ప్రభావితం చేస్తుంది. ఆధునిక ప్రపంచం ఎంతగా టెక్నాలజీపై ఆధారపడి ఉందో, ఆ టెక్నాలజీ ఎంత సులభంగా దెబ్బతినవచ్చో ఈ పరిణామం హెచ్చరిస్తోంది. చమురు సరఫరాను పునరుద్ధరించడానికి ఆరు నెలలు పడుతుందని పెంటగాన్ చెబుతున్న తరుణంలో.. డేటా కేబుల్స్ కు నష్టం జరిగితే పరిస్థితి ఎంత భయంకరంగా ఉంటుందో ఊహించుకోవడమే కష్టం.

# అనకాపల్లిని మరో రంగారెడ్డి జిల్లాగా తీర్చిదిద్దుతాం

భారీ పెట్టుబడులతో అనకాపల్లి జిల్లా అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని, భవిష్యత్తులో ఈ జిల్లా పెట్టుబడులను ఆకర్షించడంలో దేశంలోనే అగ్రస్థానానికి చేరుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. గతంలో వెనుకబడిన రంగారెడ్డి జిల్లా ఎలాగైతే సంపన్న ప్రాంతంగా మారిందో, విశాఖకు సమీపంలో ఉన్న అనకాపల్లిని కూడా మరో రంగారెడ్డి జిల్లాగా తీర్చిదిద్దుతామని ఆయన హామీ ఇచ్చారు. గురువారం అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో రూ.5,400 కోట్ల పెట్టుబడితో రెన్యూ సోలార్ సంస్థ ఏర్పాటు చేస్తున్న 6.5 గిగావాట్ల ఇన్‌గాట్–వేఫర్ తయారీ ప్లాంట్‌కు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ప్రసంగిస్తూ రాష్ట్ర అభివృద్ధిపై తన ప్రభుత్వ దార్శనికతను ఆవిష్కరించారు.

**పెట్టుబడులతో పునర్నిర్మాణం**

గత ఐదేళ్ల పాలనలో విధ్వంసానికి గురైన ఆంధ్రప్రదేశ్‌ను పునర్నిర్మించాలన్న ఏకైక లక్ష్యంతోనే కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందిస్తోందని చంద్రబాబు స్పష్టం చేశారు. ఇటీవలే ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ప్లాంట్‌కు శంకుస్థాపన జరిగిందని గుర్తుచేస్తూ, ఇప్పుడు రెన్యూ ఎనర్జీ సంస్థ భారీ పెట్టుబడితో ముందుకు రావడం శు భపరిణామమన్నారు. కేంద్ర మాజీ మంత్రి యశ్వంత్ సిన్హా కుమారుడు జయంత్ సిన్హా వేగంగా అభివృద్ధి చెందుతున్న సోలార్ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆంధ్రప్రదేశ్‌ను ఎంచుకోవడం రాష్ట్రంపై ఉన్న నమ్మకానికి నిదర్శనమని కొనియాడారు. అనంతపురం, కర్నూలు జిల్లాల్లో ఇప్పటికే సౌర, పవన విద్యుత్ ఉత్పత్తి జరుగుతుండగా, రాంబిల్లిలో సోలార్ ఫలకాల తయారీ పరిశ్రమ రావడం ద్వారా రాష్ట్రం విద్యుత్ రంగంలో స్వయం సమృద్ధ దిశగా అడుగులు వేస్తోందని తెలిపారు.

**గ్రీన్ ఎనర్జీయే లక్ష్యం**

రాష్ట్రంలో 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటికే ఈ రంగంలో రూ.5.95 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని ముఖ్యమంత్రి వెల్లడించారు. 90 గిగావాట్ల మేర ప్రతిపాదనలు, ఒప్పందాలు (ఎంఓయూలు) సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఒక్క ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ సంస్థే రూ.1.85 లక్షల కోట్ల పెట్టుబడులతో ముందుకు వస్తోందన్నారు. అభివృద్ధికి విద్యుత్ వినియోగం ఒక సూచిక అని, అందుకే విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నామని వివరించారు. దీనిలో భాగంగా పర్యావరణ హితమైన ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహిస్తున్నామని, ఆర్టీసీ కూడా 1,050 గ్రీన్ బస్సులను ప్రవేశపెడుతోందని, రాష్ట్రవ్యాప్తంగా 5,000 ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయబోతున్నామని ప్రకటించారు.

**గత ప్రభుత్వంపై విమర్శలు**

గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ వ్యవస్థ పూర్తిగా ధ్వంసమైందని చంద్రబాబు ఆరోపించారు. 2019–24 మధ్య కాలంలో విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను (పీపీఏలు) రద్దు చేయడం, నిర్వహణా లోపంతో అధిక ధరకు విద్యుత్ కొనుగోలు చేయడం వంటి చర్యలతో రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందన్నారు. పీపీఏల రద్దు కారణంగా విద్యుత్ వాడుకోకుండానే రూ.9 వేల కోట్ల ప్రజాధనాన్ని చెల్లించాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలపై వేల కోట్ల రూపాయల భారాన్ని మోపి 'ట్రూ అప్' ఛార్జీల రూపంలో వసూలు చేశారని విమర్శించారు. తాము ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు విద్యుత్ ఛార్జీలు పెంచబోమని, తమ ప్రభుత్వం ప్రారంభించిన విద్యుత్ సంస్కరణల ఫలాలను ప్రజలకు అందిస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు.

# తెలంగాణలో నేటి నుంచే వేసవి సెలవులు

విద్యార్థులందరూ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసే వేసవి సెలవుల సందడి తెలంగాణలో మొదలైంది. నేటి నుంచి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశా లలకు వేసవి సెలవులు ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ విద్యాశాఖ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం, నేడు (ఏప్రిల్ 23) విద్యా సంవత్సరం అధికారికంగా ముగిసింది. రేపటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలన్నీ వేసవి సెలవుల కారణంగా మూతపడనున్నాయి.

**సమ్మర్ హాలిడేస్ షెడ్యూల్:**

ఏప్రిల్ 24 నుంచి జూన్ 11 వరకు మొత్తం 50 రోజుల పాటు విద్యార్థులకు సెలవులు ఉండనున్నాయి.

జూన్ 12న పాఠశాలలు తిరిగి ప్రారంభమవుతాయి.

సాధారణంగా ఏప్రిల్ నెలాఖరు వరకు తరగతులు జరిగేవి, కానీ ఈ ఏడాది ఎండలు ఇప్పటికే 40 డిగ్రీలు దాటుతుండటంతో విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా ప్రభుత్వం ముందస్తుగానే సెలవులు ప్రకటించింది.

# జయమంగళ వెంకటరమణ రాజీనామా తిరస్కరించిన ఏపీ శాసనమండలి ఛైర్మన్

ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో ఓ ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ సమర్పించిన రాజీనామాను శాసనమండలి ఛైర్మన్ మోషేన్ రాజు తిరస్కరించారు. దీంతో ఆయన ఎమ్మెల్సీ పదవి యథాతథంగా కొనసాగనుంది. వివరాల్లోకి వెళితే, 2024 నవంబరులో జయమంగళ వెంకటరమణ వైసీపీకి, తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. అయితే, తన రాజీనామాను ఛైర్మన్ ఉద్దేశపూర్వకంగా ఆమోదించకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపిస్తూ ఆయన గత ఏడాది హైకోర్టును ఆశ్రయించారు.ఈ పిటిషన్‌పై ఇటీవల విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం, జయమంగళ రాజీనామాపై మూడు వారాల్లోగా నిర్ణయం తీసుకోవాలని మండలి ఛైర్మన్‌ను ఆదేశించింది. కోర్టు ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటామని ప్రభుత్వ న్యాయవాది సైతం హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే ఛైర్మన్ మోషేన్ రాజు, జయమంగళ రాజీనామాను తిరస్కరిస్తూ నిర్ణయం తీసుకున్నారు. రాజీనామాకు జయమంగళ సమర్పించిన సమాధానం సంతృప్తికరంగా లేదనే కారణంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. హైకోర్టు ఆదేశాల తర్వాత చోటుచేసుకున్న ఈ పరిణామం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. రాజీనామా తిరస్కరణకు గురవడంతో చట్టప్రకారం జయమంగళ ఎమ్మెల్సీగా కొనసాగనున్నారు.కాగా, అప్పట్లో వైసీపీకి రాజీనామా చేసిన జయమంగళ వెంకటరమణ... పవన్ కల్యాణ్ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు.

# తమిళనాడు, బెంగాల్ లో ముగిసిన పోలింగ్... రికార్డు స్థాయిలో ఓటింగ్ నమోదు

తమిళనాడు, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసింది. సాయంత్రం 6 గంటల సమయానికి క్యూలైన్లలో ఉన్న వారికి ఓటు వేసే అవకాశం కల్పించారు. ఇవాళ తమిళనాడులో మొత్తం 234 స్థానాలకు ఒకే విడతలో పోలింగ్ జరగ్గా, పశ్చిమ బెంగాల్ లో 152 స్థానాల్లో తొలి విడత పోలింగ్ నిర్వహించారు. రెండు రాష్ట్రాల్లోనూ రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదైంది. ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరిన ప్రజలు, తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు భారీ ఉత్సాహం ప్రదర్శించారు.

ఎన్నికల సంఘం అంచనాల ప్రకారం, సాయంత్రం 5 గంటలకే పశ్చిమ బెంగాల్‌లో 89.93 శాతం, తమిళనాడులో 82.24 శాతం పోలింగ్ నమోదైంది. ఇది 2021 అసెంబ్లీ ఎన్నికల్లో నమోదైన 82 శాతం, 74 శాతం కంటే గణనీయంగా అధికం కావడం గమనార్హం. ఎన్నికలకు ముందు తీవ్ర వివాదానికి దారితీసిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) డ్రైవ్ ప్రభావం ఏమాత్రం కనిపించకపోగా, పోలింగ్ శాతం ఊహించని స్థాయికి చేరడం విశేషం.తమిళనాడులోని మొత్తం 234 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. రాష్ట్రవ్యాప్తంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఎండ తీవ్రతను సైతం లెక్కచేయకుండా ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారు. డీఎంకే నేతృత్వంలోని సెక్యులర్ ప్రోగ్రెసివ్ అలయన్స్, ఏఐఏడీఎంకే నేతృత్వంలోని ఎన్డీఏ, నామ్ తమిళర్ కట్చి (ఎన్టీకే), తమిళగ వెట్రి కళగం (టీవీకే) మధ్య చతుర్ముఖ పోటీ నెలకొంది. చెన్నైలో పోలింగ్ చివరి గంటలో, ఓటర్లు తమ హక్కును తప్పకుండా వినియోగించుకోవాలని ఎన్నికల సంఘం ప్రత్యేకంగా విజ్ఞప్తి చేసింది. ఏఐఏడీఎంకే అభ్యర్థి డి. జయకుమార్, బీజేపీ నేత ఖుష్బూ సుందర్ వంటి ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకుని, ప్రజలు కూడా భాగస్వాములు కావాలని కోరారు.ఈ ఎన్నికల్లో కన్యాకుమారి జిల్లాలో ప్రజాస్వామ్య స్ఫూర్తి వెల్లివిరిసింది. రోడ్డు సౌకర్యం లేని మారుమూల కొండ ప్రాంతాలకు చెందిన 'కని' గిరిజన తెగ ప్రజలు, పెచిపారై డ్యామ్‌లో పడవలపై ప్రయాణించి వచ్చి మరీ ఓటు వేశారు. డ్యామ్‌లో నీటిమట్టం ఎక్కువగా ఉండటంతో, జిల్లా యంత్రాంగం లైఫ్ జాకెట్లతో కూడిన మూడు ప్రత్యేక పడవలను ఏర్పాటు చేసి వారిని సురక్షితంగా పోలింగ్ కేంద్రాలకు తరలించింది. మరోవైపు, డీఎంకే కూటమి 200కు పైగా స్థానాల్లో గెలిచి అధికారంలోకి రావడం ఖాయమని ఎండీఎంకే నేత వైగో ధీమా వ్యక్తం చేశారు. అదేవిధంగా, పశ్చిమ బెంగాల్‌లో తొలి విడతలో భాగంగా 16 జిల్లాల పరిధిలోని 152 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉత్తర బెంగాల్‌లోని కూచ్ బెహార్, డార్జిలింగ్, జల్‌పాయ్‌గురి, దక్షిణ బెంగాల్‌లోని ముర్షిదాబాద్, పురులియా, బంకురా వంటి జిల్లాల్లో ఓటర్లు భారీగా తరలివచ్చారు. మిగిలిన 142 నియోజకవర్గాలకు రెండో విడత పోలింగ్ ఏప్రిల్ 29న జరగనుంది. రెండు రాష్ట్రాల ఎన్నికల ఓట్ల లెక్కింపు మే 4న చేపట్టి, ఫలితాలను వెల్లడిస్తారు. ఈ ఫలితాలు రెండు రాష్ట్రాల భవిష్యత్తును నిర్ణయించనున్నాయి.

# టార్గెట్లు కాదు.. భద్రతే ముఖ్యం

సైబర్ మోసాలకు అడ్డుకట్ట వేయడంలో బ్యాంకులు కీలకపాత్ర పోషించాలని, 'జీరో మ్యూల్ అకౌంట్లు' లక్ష్యంగా పనిచేయాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ స్పష్టం చేశారు. గురువారం నగరంలోని 45 ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంకులకు చెందిన 75 మంది సీనియర్ అధికారులతో ఆయన ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. సైబర్ నేరగాళ్లు అమాయక ప్రజల నుంచి దోచుకున్న డబ్బును మళ్లించేందుకు వాడే 'మ్యూల్ అకౌంట్ల'ను పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా ఈ సమావేశం జరిగింది.

ఇటీవల హైదరాబాద్ పోలీసులు నిర్వహించిన 'ఆపరేషన్ ఆక్టోపస్'లో భాగంగా మ్యూల్ అకౌంట్లు తెరిచేందుకు కొందరు బ్యాంకు అధికారులు సైబర్ నేరగాళ్లకు సహకరించినట్లు తేలింది. ఈ నేపథ్యంలో సజ్జనార్ బ్యాంకు అధికారులతో నేరుగా మాట్లాడారు. అదనపు పోలీస్ కమిషనర్ (క్రైమ్స్ & సిట్) ఎం. శ్రీనివాసులు, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ డైరెక్టర్ చిన్మయ్ కుమార్ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సజ్జనార్ మాట్లాడుతూ... "బ్యాంకు బ్రాంచ్‌లు కొత్త ఖాతాలు తెరిచే టార్గెట్లపై కాకుండా, పౌరుల భద్రత, సంస్థాగత సమగ్రతపై దృష్టి పెట్టాలి. దీనికోసం 'ట్విన్–ఛాలెంజ్' విధానాన్ని ప్రవేశపెట్టాలి. 'జీరో సైబర్ క్రైమ్ బాధితులు', 'జీరో మ్యూల్ అకౌంట్లు' అనే అంశాలను బ్రాంచ్‌ల పనితీరుకు కొలమానంగా తీసుకోవాలి. ఖాతాల సంఖ్యను పనితీరుకు ప్రామాణికంగా చూడొద్దు" అని సూచించారు.సైబర్ మోసాలకు సంబంధించి తమ సంస్థలో 'జీరో టాలరెన్స్' విధానాన్ని పాటించాలని, బాధితుల పట్ల సానుభూతితో వ్యవహరించి, వారికి జాతీయ హెల్ప్‌లైన్ (1930), సైబర్‌క్రైమ్ పోర్టల్ గురించి తెలియజేయాలని ఆదేశించారు. మోసపూరిత ఖాతాలు తెరవడంలో పాలుపంచుకున్న కేవైసీ వెరిఫైయర్లపై కఠినమైన క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని, అలాంటి ఉద్యోగులను బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగం నుంచే బ్లాక్‌లిస్ట్ చేయాలని అన్నారు. 'మ్యూల్ హంటర్' వంటి అధునాతన టెక్నాలజీని ఉపయోగించి మోసాలను గుర్తించాలని సూచించారు.కంబోడియా, వియత్నాం, యూఏఈ వంటి దేశాల నుంచి సైబర్ ముఠాలు పనిచేస్తున్నాయని, అవి భారతీయ మధ్యవర్తుల ద్వారా బ్యాంకు అధికారులతో కుమ్మక్కై మ్యూల్ అకౌంట్లను తెరిచి, నిధులను తరలిస్తున్నాయని సజ్జనార్ వివరించారు. ఈ నెట్‌వర్క్‌లను ఛేదించడంలో బ్యాంకుల సహకారం అత్యంత కీలకమని ఆయన తెలిపారు.

## అనంతబాబుకు సమాచారం అందించినట్టు ఆరోపణలు.. సీఐపై వేటు

డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో ప్రధాన నిందితుడు, వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబుకు పోలీసుల అంతర్గత సమాచారాన్ని చేరవేస్తున్నారన్న ఆరోపణలతో సర్పవరం సీఐ రవికుమార్‌పై వేటు పడింది. కేసు దర్యాప్తుకు సంబంధించిన అత్యంత కీలకమైన రహస్య సమాచారాన్ని, పోలీసుల కదలికలను సీఐ రవికుమార్ ఎప్పటికప్పుడు అనంతబాబుకు చేరవేస్తున్నట్లు ఉన్నతాధికారులు గుర్తించారు. దర్యాప్తు పారదర్శకతను దెబ్బతీస్తూ నిందితుడికి సహకరించినందుకు గాను, ఏలూరు రేంజ్ ఐజీ ఆయనను తక్షణమే విధుల్లో నుంచి తప్పించి, వీఆర్ కు పంపుతూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనపై శాఖాపరమైన విచారణకు కూడా ఆదేశాలు జారీ చేశారు.

## అక్రమ చొరబాటుదారుల ఆట కట్టిస్తాం.. బెంగాల్‌ను విముక్తం చేయండి

- మొదటి పేజి తరువాయి

అక్రమంగా సరిహద్దు దాటి రానివ్వబోమని, ఇప్పటికే ఉన్న వారిని గుర్తించి పంపించివేస్తామని స్పష్టం చేశారు. స్థానిక యువతకు దక్కాల్సిన రేషన్, ఉద్యోగాలను ఈ అక్రమ వలసదారులు లాగేసుకుంటున్నారని, ఇది రాష్ట్ర అభివృద్ధికి పెద్ద ఆటంకమని ఆరోపించారు.మీరు వేసే ఓటు కేవలం ఒక ఎమ్మెల్యే కోసమే కాదని, అక్రమ చొరబాటుదారుల నుంచి బెంగాల్ విముక్తి కోసం కూడా అని పేర్కొన్నారు. మే 5వ తేదీతో 'దీదీ' పాలన ముగుస్తుందని ధీమా వ్యక్తం చేశారు.నేడు పశ్చిమ బెంగాల్ అసెంబ్లీకి తొలి దశ (152 స్థానాలు) పోలింగ్ జరుగుతోంది. సాయంత్రం 5 గంటల సమయానికే దాదాపు 89 శాతానికి పైగా భారీ ఓటింగ్ నమోదైంది. ఇది మరింత పెరిగే అవకాశం ఉంది.

## జగన్ నివాసానికి వెళ్లి ఆశీస్సులు అందించిన ఒంటిమిట్ట అర్చకులు... టీటీడీ ఫైర్

- మొదటి పేజి తరువాయి

ఈ ఆలయంలో పనిచేసే అర్చకులు ప్రొటోకాల్‌ను అతిక్రమించడంపై యాజమాన్యం తీవ్రంగా స్పందించింది. వ్యక్తిగత హోదాలో రాజకీయ నాయకుల ఇళ్లకు వెళ్లి ఆలయ మర్యాదలను పాటించకపోవడం సరికాదని భావించింది. ఈ నేపథ్యంలోనే సదరు అర్చకులపై చర్యలకు ఉపక్రమించింది. అర్చకులకు జారీ చేసిన షోకాజ్ నోటీసుల్లో రెండు రోజుల్లోగా తమ వివరణ సమర్పించాలని టీటీడీ స్పష్టం చేసింది. వారు ఇచ్చే సమాధానం సంతృప్తికరంగా లేకపోతే కఠినమైన క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించినట్లు తెలుస్తోంది. ఆలయ పవిత్రత, నియమ నిబంధనల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని టీటీడీ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రస్తుతం ఈ నోటీసులపై అర్చకుల నుంచి ఇంకా ఎలాంటి స్పందన రాలేదు. వారి వివరణ అందిన తర్వాత టీటీడీ తదుపరి చర్యలు తీసుకోనుంది.

## పెట్రోల్, డీజిల్ ధరల పెంపు వుండదు.. కేంద్రం కీలక ప్రకటన

- మొదటి పేజి తరువాయి

ధరల పెంపునకు సంబంధించి ప్రభుత్వ పరిశీలనలో ఎలాంటి ప్రతిపాదన లేదని 'ఎక్స్' వేదికగా స్పష్టం చేసింది.ప్రజలలో అనవసర భయాందోళనలు సృష్టించేందుకే ఇలాంటి వార్తలను ప్రచారం చేస్తున్నారని మంత్రిత్వ శాఖ పేర్కొంది. "గత నాలుగేళ్లుగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరగని ఏకైక దేశం భారత్. అంతర్జాతీయంగా ధరలు భారీగా పెరిగినప్పటికీ, ఆ ప్రభావం ప్రజలపై పడకుండా ప్రభుత్వం, ప్రభుత్వ రంగ చమురు సంస్థలు నిరంతరం చర్యలు తీసుకున్నాయి" అని వివరించింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరిగి, అంతర్జాతీయంగా చమురు ధరలు పెరిగినప్పటికీ భారత్‌లో ధరలు స్థిరంగానే ఉన్నాయని గుర్తుచేసింది.

**దేశంలో సాధారణంగానే ఎల్పీజీ సిలిండర్ల సరఫరా**

ఇదే సమయంలో దేశంలో వంటగ్యాస్ (ఎల్పీజీ) సరఫరా సాధారణంగా ఉందని, ఎక్కడా కొరత లేదని పెట్రోలియం శాఖ జాయింట్ సెక్రటరీ సుజాత శర్మ తెలిపారు. మరోవైపు అమెరికా–ఇరాన్ శాంతి చర్చలు నిలిచిపోవడంతో హర్మూజ్ జలసంధిలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఈ కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 103 డాలర్లు దాటగా, డబ్ల్యూటీఐ క్రూడ్ ఆయిల్ ధర 94 డాలర్లకు పైగా ట్రేడ్ అవుతోంది.

# ఘనంగా భగీరథ మహర్షి జయంతి






**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, ఏప్రిల్ 23:**త్రేతాయుగానికి చెందిన మహర్షి భగీరథ జయంతి సందర్భంగా పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ గురువారం ఘనంగా నివాళు లర్పించారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి అధికారులతో కలిసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భగీరథ మహర్షి తపస్సు ద్వారా గంగాదేవిని దివి నుంచి భూమికి రప్పించిన మహనీయుడని కొనియాడారు. పేద ప్రజల సంక్షేమం కోసం కఠోర తపస్సు చేసి, శివుని ప్రార్థనతో గంగను భూమిపైకి ప్రవహింపజేసి సగరపుత్రుల అస్థికలను పవిత్రం చేసిన ఘనత ఆయనదేనని తెలిపారు. భగీరథ మహర్షి జీవితం, పుట్టుపూర్వోత్తరాలు పురాణ గ్రంథాల ద్వారా తెలుస్తాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు భగీరథ మహర్షి జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పి. అంబేద్కర్, ఏపీఓ జనరల్ డి.ఎన్.వి రమణ, గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మురళి, జిల్లా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ కే. ఉమా, ఐటీడీఏ ఏవో యర్రంశెట్టి రాజు, ఏఈలు తరుణ్ కుమార్, ప్రవీణ్ కుమార్, హెచ్‌డబ్ల్యుఓలు దుర్గ భవాని, రాజేశ్వరి, గన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

# పెన్ పవర్

పోలవరం - ఏలూరు

తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి

# పోలవరం జిల్లా నూతన జాయింట్ కలెక్టర్‌గా ప్రశాంత్ కుమార్ బాధ్యతల స్వీకరణ





**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, ఏప్రిల్ 23:**పోలవరం జిల్లా నూతన జాయింట్ కలెక్టర్‌గా సూరపాటి ప్రశాంత్ కుమార్ గురువారం పదవి బాధ్యతలు స్వీకరించారు. ఐటీడీఏ కార్యాలయంలో పురోహితులు అద్దంకి వెంకటేశ్వరరావు వేదమంత్రాల నడుమ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సూరపాటి ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు ముందుగా జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్‌ను కలిసి అనంతరం జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు. పోలవరం జిల్లాలో గిరిజనుల సమస్యలు, రెవెన్యూ అంశాలు, సివిల్ సప్లై సమస్యలు, సామాజిక పింఛన్ల వంటి ప్రజా సమస్యలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని అర్హతల మేరకు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి పి. అంబేద్కర్, ఏపీఓ జనరల్ డి.ఎన్.వి రమణ, ఐటీడీఏ పరిపాలన అధికారి ఎర్రంశెట్టి రాజు, డిప్యూటీ తహసీల్దార్ పృథ్వి తదితర అధికారులు, కార్యాలయ సిబ్బంది పూర్ణకుంభంతో ఆహ్వానం పలికి బొకేలు అందజేసి నూతన జాయింట్ కలెక్టర్‌కు స్వాగతం పలికారు.

## డిప్యూటీ సీఎం పవన్ ఆరోగ్యంగా ఉండాలి.



**గోపాలపురం, పెన్ పవర్,ఏప్రిల్ 23.**

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఆరోగ్యంగా ఉండాలని కోరుతూ గోపాలపురంలో గురువారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక బస్టాండ్ సెంటర్ వద్ద ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో నిర్వహించిన ఈ పూజా కార్యక్రమంలో జనసేన గోపాలపురం నియోజకవర్గం ఇంచార్జ్ దొడ్డిగర్ల సువర్ణరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్వామివారికి పూజలు చేసి పవన్ కళ్యాణ్ ఆరోగ్యం తొందరగా మెరుగుపడాలని ఆయన సుఖసంతోషాలు ఆరోగ్యాలతో ఉండాలని కోరుకున్నారు. తొందరగా ప్రజాజీవనంలోనికి అడుగు పెట్టి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ నాయకులు జేష్ట శ్రీధర్, గెల్లా శ్రీను, భూ రెడ్డి వాసు, పడమటి శ్రీనివాసరావు, వడ్డీ రామ్ లీలాధర్, చోళ నాని తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదంలో కాలు కోల్పోయిన కొమరయ్యకు ఎచ్చు రవి ఆర్థిక సాయం...



ఆపదలో ఉన్నవారికి తన వంతు సాయం

**కూనవరం,పెన్ పవర్,ఏప్రిల్ 23.**ఆపదలో ఉన్నారని తెలిసిన మరుక్షణమే నేనున్నానంటూ ఆపదలో ఉన్నవారికి తన వంతు సాయం చేస్తు దాతృత్వాన్ని చాటుకుంటున్న యువకుడు ఎచ్చు రవి. మండలంలో 5కుటుంబాలను దత్తతు తీసుకుని ప్రభుత్వం నుండి ప్రశంస పత్రాన్ని పొందిన యువకుడు. పైడిగూడెం గ్రామానికి చెందిన బత్తుల కొమరయ్య ప్రమాదంలో కాళ్ళు కోల్పోవడంతో పోవడంతో ఇంటికే పరిమితమై కుటుంబ పోషణ భారం కావడం ఏమి చేయాలో తెలియక సతమతమవుతున్న తరుణంలో నేనున్నానంటూ నేనున్నా అంటూ ముందుకు వచ్చి ఆ కుటుంబాన్ని దత్తతు తీసుకొని వెన్ను ధైర్యంగా నిలిచాడు. ఆ కుటుంబానికి నిత్యావసర వస్తువులు,30 కేజీల బియ్యం,వెయ్యి రూపాయలు నగదు అందజేశాడు. కొమరయ్య కుటుంబానికి ఏఅవసరం వచ్చిన నేనున్నానని,ఆకుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటానని భరోసా ఇచ్చాడు.

## దోసకాయలపల్లిలో వైభవంగా శివాలయ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం..

ఎమ్మెల్యే సతీమణి బత్తుల వెంకటలక్ష్మి స్వామివారిని దర్శించుకున్నారు..



**కోరుకొండ, పెన్ పవర్, ఏప్రిల్ 23:** దోసకాయలపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శివాలయ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం గురువారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి రాజానగరం నియోజకవర్గం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ సతీమణి జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కమిటీ కో–ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి విశిష్ట అతిథిగా హాజరయ్యారు.

ఆలయానికి చేరుకున్న ఆమెకు గ్రామస్తులు మరియు ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆమె స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు ఆమెకు ఆశీర్వచనాలు అందించి,తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా బత్తుల వెంకటలక్ష్మి మాట్లాడుతూ గ్రామాల్లో దేవాలయాల నిర్మాణం వల్ల ఆధ్యాత్మికత వెల్లివిరుస్తుందని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆ పరమశివుడిని ప్రార్థించినట్లు తెలిపారు. ఇంతటి భవ్యమైన ఆలయాన్ని నిర్మించడంలో భాగస్వాములైన దాతలను,గ్రామ పెద్దలను ఆమె అభినందించారు. భక్తి భావం వల్ల సమాజంలో శాంతి,సమరస్యం పెరుగుతాయని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్ని రాము, మార్ని బుజ్జి,సూదిన గంగాధర్, ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులు జనసేన, తెలుగుదేశం, బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాల పనులు వేగవంతం చేయాలి

కలెక్టర్ దినేష్ కుమార్






**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, ఏప్రిల్ 23:** పోలవరం జిల్లాలోని మారుమూల గిరిజన గ్రామాల్లో మంజూరైన మౌలిక సదుపాయాల పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం రంపచోడవరం ఐటీడీఏ సమావేశ మందిరంలో వివిధ శాఖల ఇంజనీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్, రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి స్మరణ్ రాజ్, చింతూరు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి శుభం నొక్వాల్ పాల్గొన్నారు. గృహ నిర్మాణ, పంచాయతీరాజ్, గిరిజన సంక్షేమ, గ్రామీణ నీటిపారుదల, ఏపీఈపీడీసీఎల్, ఏపీడబ్ల్యూడీసీ, పిఐయూ తదితర శాఖల ఇంజనీర్లు హాజరయ్యారు. సమీక్ష సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రంపచోడవరం, చింతూరు డివిజన్లలో పివిటిజీల సంఖ్య, కుటుంబాల వివరాలు, పంచాయతీల పరిధి తదితర అంశాలపై అధికారులను ప్రశ్నించారు. పీఎం జన్మన్ పథకం ద్వారా మంజూరైన గృహాల పురోగతి, పూర్తయినవి, పెండింగ్‌లో ఉన్నవి తదితర వివరాలు సమర్పించాలని ఆదేశించారు. ఇంకా గృహాలు పొందని పివిటిజీలకు వచ్చే ఏడాదిలో గృహాల మంజూరు కోసం నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. గతంలో నిలిచిపోయిన కచ్చా గృహాలపై పూర్తి నివేదిక ఇవ్వాలని, గృహ నిర్మాణ పనులను వారానికో యాక్షన్ ప్లాన్ ప్రకారం మూడు నెలల్లో పూర్తి చేయాలని ఇంజనీర్లకు ఆదేశించారు. జిల్లాలో సుమారు 26 వేల పివిటిజీ కుటుంబాలకు గృహాల అర్హత, అనర్హత వివరాలను సక్రమంగా నమోదు చేయాలని చెప్పారు. మారుమూల గ్రామాలకు రోడ్ల నిర్మాణం, ఫారెస్ట్ క్లియరెన్స్ పరిస్థితి, గిరిజన సంక్షేమ శాఖ ద్వారా చేపట్టిన పనుల పురోగతి, గ్రామీణ నీటిపారుదల శాఖ ద్వారా జల్ జీవన్ మిషన్ కింద చేపట్టిన తాగునీటి పనులపై సమగ్రంగా సమీక్షించారు. జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే పీఎం జన్మన్ పథకం కింద గృహాలకు విద్యుత్ సదుపాయం కల్పించడం, ఏపీఈడబ్ల్యూ ఐసీ ద్వారా చేపట్టిన పనుల పురోగతి వంటి అంశాలపై శాఖలవారీగా సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పి. అంబేద్కర్, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య,ఏపీవోలు డిఎన్వి రమణ, రామ తులసి, డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ దాసరి రత్నాకరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఐ. శ్రీనివాసరావు, సత్యనారాయణ, రవికుమార్, పి హెచ్ ఓ దేవదానం, జిల్లా మత్స్యశాఖ అధికారి దిల్షాద్, డి ఈ లు పి వెంకటరమణ, రామచంద్ర మూర్తి, సుబ్బారావు, రమేష్, నాగరాజు, జిసిసి డిఎం జయశ్రీ, ఏవోలు రాజ్ కుమార్, ఎర్రం శెట్టి రాజు, పీఎంయు అధికారులు చంద్రకళ, మోహన్, చింతూరు ఆసుపత్రి సూపరింటెంట్ వీరారెడ్డి, వెలుగు ఏపిఎంలు సూరిబాబు, దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# మహిళా బిల్లుపై బీజేపీ తప్పుడు ప్రచారం మానుకోవాలి




**-ఎంపీ పురంధరేశ్వరిపై కాంగ్రెస్ నాయకుల ఆగ్రహం**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఏప్రిల్ 23:**మహిళా రిజర్వేషన్ బిల్లు సాకుతో బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగంలోని 131వ రాజ్యాంగ అధికరణానికి సవరణ చేసి దొడ్డిదారిన డిలిమిటేషన్ బిల్లును ఆమోదింప చేయడానికి కుట్రలు పన్నిందని కాంగ్రెస్ పార్టీ అర్బన్ జిల్లా అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ విమర్శించారు. దేశంలో మహిళల సాధికారతకు కృషిచేస్తున్న ఏకైక పార్టీ కాంగ్రెస్ మాత్రమేనన్నారు. మహిళలకు రిజర్వేషన్ కల్పించడానికి కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా , రాహుల్ , ప్రియాంకా సానుకూలంగానే ఉన్నారని బాలేపల్లి మురళీధర్ అన్నారు. స్థానిక మున్సిపల్ కాలనీలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన మీడియా సమావేశంలో బాలేపల్లితో పాటు పిసిసి ఉపాధ్యక్షుడు ఎస్.మార్టిన్ లూథర్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు మోతా శారద, నిడదవోలు కో ఆర్డినేటర్ మేడవరపు భద్రం దొర తదితరులు మాట్లాడారు.

ఈ సందర్భంగా బాలెపల్లి మాట్లాడుతూ,పార్లమెంట్‌లో ఇండియా కూటమి ఎంపీలు ఆ బిల్లుకి వ్యతిరేకంగా ఓటువే యడం జరిగిందన్నారు.

మహిళా రిజర్వేషన్ బిల్లుకి కాంగ్రెస్ వ్యతిరేకం కాదని పార్లమెంట్ సాక్షిగా లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పష్టం చేసారన్నారు. బీజేపీ మహిళా రిజర్వేషన్ బిల్లును కాంగ్రెస్ పార్టీ అడ్డుకుందని దుష్ప్రచారం చేయడం దారుణమన్నారు. రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురంధరేశ్వరి కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలపై చేసిన విమర్శలను వారు తీవ్రంగా ఖండించారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన ఇన్నేళ్ల తరువాత 2023లో రాజ్యసభలో పాస్ అయిన మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు చేయకుండా కుట్రలు చేయడం సమంజసం కాదన్నారు. డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తవ్వడానికి సంవత్సరాలు పట్టే పరిస్థితిలో మహిళా బిల్లును ఎలా అమలు చేస్తారని ఆయన ప్రశ్నించారు.డిమిలిటేషన్ పేరుతో ఉత్తర భారతం లోని రాష్ట్రాల్లో సీట్లు పెంచుకుని దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేయాలని బిజేపీకి తగదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎంపీగా గెలిపించి కేంద్ర సహాయ మంత్రి పదవి అనుభవించిన తరువాత పార్టీ పిరాయించి ఇప్పుడు కాంగ్రెస్‌ను విమర్శించడం పురంధరేశ్వరికి తగదన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓబిసిలతో పాటు మహిళల సంక్షేమానికి కాంగ్రెస్ ఎన్నో పథకాలు అమలు చేసిందన్నారు. ఈ సమావేశంలో జిల్లా డాక్టర్స్ సెల్ చైర్మన్ రాజశేఖర్, రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి సింధియా రాణి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు దేవత సుధాకర్, అర్బన్ బీసీ సెల్ చైర్మన్ తాడి సూరిబాబు, అనపర్తి ఇన్చార్జి గుండ్రపు ఏసు, బిక్కవోలు ఇన్చార్జి కొల్లి చిన్న, బర్రే సుబ్రహ్మణ్యం, ఎండి ఆలీ, మురళీకృష్ణ, నిల్లా వీర్రాజు, యాళ్ళ వీర భద్రరావు, లలిత, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ అనంత బాబు బెయిల్ రద్దు చేయాలి

- సాక్షులకు, బాధితులకు రక్షణ కల్పించాలి
- మాదిగ రాజకీయ పోరాట సమితి అధ్యక్షులు ఆకుమర్తి చిన్న మాదిగ ఆధ్వర్యంలో నిరసన



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఏప్రిల్ 23 :**రాష్ట్రంలో సంచలనం కలిగించిన డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసులో నిందితుడు ఎమ్మెల్సీ అనంతబాబుకు బెయిల్ రద్దు చేసి అరెస్టు చేయాలని కోరుతూ మాదిగ రాజకీయ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఆకుమర్తి చిన్న మాదిగ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక గోకవరం బస్టాండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం వద్ద ఎమ్మెల్సీ అనంతబాబును" సాక్షులను బెదిరించిన ఘటనలో అరెస్టు చేయాలని కోరుతూ ఆందోళన నిర్వహించారు. వీధి సుబ్రమ ణ్యం హత్య కేసులో కుట్ర దారులను, సాక్ష్యులను బెదిరించిన వ్యక్తులను అరెస్ట్ చేయాలని, బాధితులకు , సాక్షులకు రక్షణ కల్పించాలని కోరుతూ ప్ల కార్డులు పట్టుకొని ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు ఆకుమర్తి చిన్న మాదిగ మాట్లాడుతూ, ఎమ్మెల్సీ అనంతబాబు తన కారు డ్రైవర్ ను కిరాతకంగా హత్య చేసి డోర్ డెలివరీ చేసిన కేసు జరిగి 3 సంవత్సరాల అయినప్పటికీ నిందితుడిని ఇప్పటికీ అరెస్టు చేయలేదని మండి పడ్డారు. కేసు నుంచి తప్పించుకునేందుకు సాక్షులను బెదిరిస్తున్నారన్నారు. నిందితుడి కి కొంతమంది అధికారులు సహకరిస్తున్నారని కేసు నుంచి తప్పించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు . బహిరంగంగా అనంతబాబు అనుచరులు బాధితులను కాకినాడ సమీరా అపార్ట్మెంట్ లో చంపుతామని బెదిరించి, భయభ్రాంతులకు గురిచేసారని అన్నారు. బాధితులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. బాధితులను భయభ్రాంతులకు గురి చేస్తున్న ఈ కేసులో ఏ – 1 ముద్దాయి అనంతబాబును, ఏ –2 అనంతబాబు భార్యను, సాక్షులను బెదిరించిన ముద్దాయిలను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కేసులో సాక్ష్యం చెప్పేందుకు ధైర్యంగా ముందుకు వచ్చిన సాక్షులకు అండగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో దొండపాటి కృషపర్, రాచర్ల మురళి, వుడమల నాగేశ్వరరావు, బోయినపల్లి సుందరయ్య, కట్టా రాములు, మద్దాల యేసు పాదం, రాచర్ల మురళి, బొడ్డపాటి నాగేశ్వరరావు, తాతపూడి రాజేష్, ఎల్లబెల్లి ఝాన్సీ, మన్యలదుర్గ, పెండ్యాల కుమారి,కొత్తలంక రమణ,మాతా మాలతి తదితరులు పాల్గొన్నారు

# హంతకులంటే జగన్ కు "అనంత" ప్రేమ



- ఎంఎల్సీ అనంతబాబు కేసులో నిజాలు వెలికి తీయాలి
- షెడ్యూల్ క్యాస్ట్ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశీ నవీన్ కుమార్ నిరసన

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఏప్రిల్ 23:** హంతకులంటే జగన్ కు "అనంత" మైన ప్రేమ ఎందుకని షెడ్యూల్ క్యాస్ట్ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశీ నవీన్ కుమార్ ప్రశ్నించారు. రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఎంఎల్సీ అనంతబాబు హత్య కేసులో పూర్తి స్థాయి నిజాలు వెలుగులోకి రావాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు గోకవరం బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి నిరసన తెలిపారు. అనంతరం కాశీ నవీన్ కుమార్ మాట్లాడుతూ , 2022 మే 19న అనంతబాబు తన వద్ద పనిచేసే సుబ్రహ్మణ్యాన్ని ఇంటి లో హత్య చేసి, ఆ తర్వాత మృతదేహాన్ని రోడ్డు ప్రమాదంగా మలిచేందుకు కుట్ర పన్నారని అన్నారు.కేసు ప్రారంభ దశలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని, కీలక ఆధారాలైన సీసీటీవీ ఫుటేజీలు, కాల్ డేటా రికార్డులు, టవర్ లొకేషన్ వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించలేదని తెలిపారు.మృతదేహంపై ఉన్న గాయాలు, పోస్ట్‌మార్టం నివేదిక స్పష్టంగా హత్య జరిగినట్టు చెబుతున్నప్పటికీ రాజకీయ ఒత్తిడి ఉందని ఆరోపించారు.

ఈ కేసులో పూర్తి దర్యాప్తు జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కాశీ నవీన్ కుమార్ డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయా లని ప్రభుత్వాన్ని కోరారు.

రాష్ట్రంలో చట్టం, శాంతి భద్రతలు పూర్తిగా దెబ్బతిన్నాయని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కప్పల వెలుగు కుమారి, చాపల చినరాజు, మద్దా మని, యాంటోని, వేమగిరి వెంకట్రావు, తలారి మూర్తి, బొర్రా చిన్ని, కవులూరి వెంకట్రావు, బేరి హర్షవర్ధన్, రాయి అప్పన్న, కొమ్మర్తి బాబ్జి, సాల్మన్, జయరాజు, బంగారు నాగేశ్వరావు, నీలాపు వెంకటేశ్వరరావు, తదితర దళిత నాయకులు పాల్గొన్నారు

# తహశీల్దార్ లావణ్య ఆధ్వర్యంలో సెన్సస్ స్వీయ నమోదుపై అవగాహనా కార్యక్రమం



**తాళ్ళపూడి, పెన్ పవర్, ఏప్రిల్ 23:** తాళ్లపూడి తహసీల్దార్ ఎన్.లక్ష్మీ లావణ్య ఆధ్వర్యంలో గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సెన్సస్--2027 లో భాగంగా స్వీయ నమోదుపై అవగాహన కార్యక్రమం నిర్వహించి, అధికారులతో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ లావణ్య మాట్లాడుతూ రాబోయే సెన్సస్--2027లో ప్రజలు స్వయంగా తమ వివరాలను నమోదు చేసుకునే విధానం ద్వారా సమగ్ర, ఖచ్చితమైన సమాచారం సేకరణ సాధ్యమవుతుందని తెలిపారు. స్వీయ నమోదు ప్రక్రియ ద్వారా ప్రజలు తమ కుటుంబ వివరాలను సులభంగా, పారదర్శకంగా నమోదు చేసుకునే అవకాశం కలుగుతుందని, తద్వారా ప్రభుత్వ పథకాలు సరైన లబ్ధిదారులకు చేరేలా సహకారం అందుతుందని పేర్కొన్నారు. ప్రతి కుటుంబం ఈ అవకాశాన్ని వినియోగించుకుని సెన్సస్ ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలని, గ్రామ స్థాయి సిబ్బంది, వాలంటీర్లు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సుంకర భాస్కరరావు మున్సిపల్ హైస్కూల్ లో క్రీడా,సాంస్కృతిక వారోత్సవాలు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఏప్రిల్ 23:**స్థానిక గాంధీ పురం 2 సుంకర భాస్కర రావు నగర పాలక ఉన్నత పాఠశాల లో గురువారం ఆత్మీయ వాతావరణంలో సమగ్ర శిక్ష అభియాన్ సౌజన్యం తో క్రీడా, సాంస్కృతిక వారోత్సవాల ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ బహుమతి కార్యక్రమంలో 350 మంది విద్యార్థులు పాల్గొన్నారు. నగరంలో ఉన్నత విలువలు, ప్రమాణాలతో, పాఠశాల విద్యార్థుల సర్వోతోము ఖాభివృద్ధికి అంకితభావం తో సేవల అందిస్తున్న హెడ్ మాస్టర్ రొబ్బి సన్యాసి రావు, టీచర్ లను పలువురు అభినందనలు తెలియ చేసారు. గత 12 సం. ల పైగా నగరం లోనే అత్యుత్తమ శాస్త్రీయ నృత్య టీం అగ్రగామి ప్రదర్శనల తో పలు జిల్లా కలెక్టర్ లు, మునిసిపల్ కమీషనర్ల, ప్రజా నాయకులు, మన్ననలు పొందుతున్న విద్యార్థి, విద్యార్థినిలను అభినందించారు. అసమాన సేవచేస్తున్న డాన్స్ మాస్టర్ పల్ల దుర్గా ప్రసాద్ ను, హెడ్ మాస్టర్ రొబ్బి సన్యాసి రావు, పాఠశాల పూర్వ విద్యార్థి, అంతర్జాతీయ స్పోర్ట్స్ , కమ్యూనిటీ సైకాలజిస్ట్ సుంకర నాగేంద్ర కిషోర్ లను ప్రశంసలు తెలియ చేశారు.వివిధ శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు అల్లరించాయి.డాన్స్ మాస్టర్ పల్ల దుర్గా ప్రసాద్, వ్యాయామ విద్య అసిస్టెంట్ శ్యామల కార్యక్రమాల నివేదిక లు సమర్పించారు.

ఈ కార్యక్రమంలో వర్రే శ్రీనివాస రావు, హెడ్ మాస్టర్ పాఠశాల విద్య కమిటీ ప్రెసిడెంట్ లక్ష్మీ ప్రసన్నంబ, కాలేపు లూకే రాజు లు విజేతలకు బహుమతి ప్రధానోత్సవం ఘనంగా జరిగింది

# జిల్లా అభివృద్ధి అధికారిగా కె. రత్న కుమారి బాధ్యతలు స్వీకరణ



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఏప్రిల్ 23:** గ్రామ ,వార్డు సచివాలయల తూర్పు గోదావరి జిల్లా అభివృద్ధి అధికారిగా కె. రత్న కుమారి గురువారం బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ కీర్తి చేకూరి ని కలెక్టర్ క్యాంపుకార్యాలయంలోమర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. జాయింట్ కలెక్టర్, ఇతర అధికారులు కూడా మర్యాద పూర్వకంగా కలిసారు.

జిల్లాలో పనిచేస్తున్న డిప్యూటీ ఎంపీడీఓలు కొత్తగా బాధ్యతలు స్వీకరించిన రత్న కుమారిని అధికారిని కలిసి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ డి డి వో గా విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలని, ఇతర శాఖల అధికారులతో సమన్వయం కలిగి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. డివిజనల్ అభివృద్ధి అధికారి బాధ్యత కీలకమైందని, ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడంలో ముఖ్యపాత్ర పోషిస్తుందన న్నారు. ఇదిలా ఉండగా కె. రత్న కుమారి 1996లో కడియం ఎంపీడీఓగా తన సేవలను ప్రారంభించి, అనంతరం కోరుకొండ, గోకవరం, కే. గంగవరం, కపిలేశ్వరపురం మండలాలలో వివిధ హోదాలలో పనిచేశారు. 2025 మే నెలలో డీడబ్ల్యుఎంఏ ఈస్ట్ గోదావరి జిల్లా డివిజనల్ అధికారిగా పదోన్నతి పొందారు. ప్రస్తుతం సీఈఓ, జిల్లా పరిషత్ హోదాలో పదోన్నతి పొంది, ఈస్ట్ గోదావరి జిల్లాలో కొత్తగా ఏర్పాటు చేసిన స్వర్ణగ్రామం, స్వర్ణ వార్డు ల శాఖ అధికారిగా నియమితులైయారు.

# అంగన్వాడీలకు జీతాలు పెంచాలి



**పెన్ పవర్, ఉంగుటూరు, ఏప్రిల్ 23**

ఎన్నికల సమయంలో అంగన్వాడీల జీతాలు పెంచుతామని ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని సీఐటీయూ నాయకుల ఆధ్వర్యంలో అంగన్వాడీలు డిమాండ్ చేశారు. సీఐటీయూ యూనియన్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా గురువారం ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు క్యాంపు కార్యాలయం వద్ద అంగన్వాడీలు ధర్నా, ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీలు ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడీ వర్కర్లకు రూ.26,000 జీతం ఇవ్వాలని, వేసవి సెలవులు కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న మినీ వర్కర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, గ్రాట్యుటీ అమలుకు గైడ్‌లైన్స్ రూపొందించి వేతనంతో కూడిన మెడికల్ లీవ్ ఇవ్వాలని నినాదాలు చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణారావు మాట్లాడుతూ, ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం నాయకులు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అంగన్వాడీ సమ్మె శిబిరాలకు వచ్చి సంఘీభావం తెలుపుతూ, అధికారంలోకి వస్తే జీతాలు పెంచుతామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయినా ఇప్పటివరకు అంగన్వాడీ వర్కర్ల సమస్యలపై దృష్టి పెట్టలేదని విమర్శించారు. అంగన్వాడీల సమస్యలను అసెంబ్లీలో చర్చించి తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం అంగన్వాడీల సమస్యలు, డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సిబ్బందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సంఘం జిల్లా నాయకులు వి.స్వర్ణకుమారి, జి.రత్నం, సిహెచ్.మల్లేశ్వరి, వై.సుజాత, ఎస్.ధనలక్ష్మి, సీఐటీయూ నాయకులు సిరా అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## మాధవరం రాపాక గోపి అకాల మరణం చాలా బాధాకరం



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. ఏప్రిల్ 23.**తాడేపల్లిగూడెం నియోజకవర్గం రూరల్ మండలం మాధవరం గ్రామానికి చెందిన రాపాక గోపి అకాల మరణం చెందినారు అది తెలుసుకుని మన తాడేపల్లిగూడెం వైస్సార్సీపీ ఇంచార్జ్ వడ్డీ రఘురామ్ నాయుడు వారి కుటుంబ సభ్యుల్ని పరామర్శించారు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అన్నివేళలా వారి కుటుంబ సభ్యులకి అండగా ఉంటుంది అని తెలిపారు.వారితోపాటు ఈ కార్యక్రమంలో కవులూరి వెంకన్న ఎంపీటీసీ డ్రా నారాయణ గోపిశెట్టి దొరబాబు రాపాక భాను తమ్మిశెట్టి రఘు తమ్మిశెట్టి చుక్కయ్య గారుచుట్టూరి బాపన్న,దారపు రెడ్డి శ్రీనివాస్,మకరాజు సతీష్, రావి వీర రాఘవ, మార్లపూడి సుబ్బారావు కందెల్లి రాజేష్, ద్వారంపూడి కిరణ్ రెడ్డి,కునుకు పుల్లయ్య,ములపర్తి అఖిల్, అడ్డాల గోపి వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# డ్రగ్స్ నియంత్రణ లక్ష్యంగా సత్యసాయి గురుకులం స్కూల్ లో 2 టౌన్ పోలీసుల అవగాహన సదస్సు





**రాజహేంద్రవరం, పెన్ పవర్, ఏప్రిల్ 23:**తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు గురువారం టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రగ్స్ నియంత్రణ లక్ష్యంగా సత్యసాయి గురుకులం స్కూల్ లో అవగాహన సదస్సు పోలిసు అధికారులు, ఈగల్ టీమ్స్ సిబ్బంది సంయుక్తంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక చట్టపరమైన దుష్పరిణామాల గురించి అవగాహన కల్పించారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని, కుటుంబ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుందని వివరించారు.

ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే ఏపీ ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972 కు సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. సమాచారం ఇచ్చే వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంటాయని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా సౌత్ జోన్ డీఎస్పీ శివ ప్రియా మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా సంబంధిత నేరాలను అరికట్టడమే లక్ష్యంగా ప్రత్యేక తనిఖీలు చేపట్టతున్నామన్నారు. ప్రజల సహకారంతో డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్( టూ టౌన్) శివ గణేష్ , పోలీసు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# డ్వామా జిల్లా విజిలెన్స్ అధికారిగా ఆర్. విజయరాజు బాధ్యతలు స్వీకరణ



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఏప్రిల్ 23:**తూర్పు గోదావరి జిల్లా డ్వామా లో జిల్లా విజిలెన్స్ అధికారిగా ఆర్. విజయరాజు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన కలెక్టర్ కీర్తి చేకూరి ని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ విజిలెన్స్ అధికారి బాధ్యతలు కీలకమని, విధి నిర్వహణలో జవాబుదారీతనం, పారదర్శక తతో పనిచేయాలని సూచిం చారు. ప్రభుత్వ కార్యక్రమాల అమలులో పర్యవేక్షణ పాత్ర ముఖ్యమని, నిబద్ధతతో పనిచేయాలన్నారు.

ఆర్. విజయరాజు గతంలో ఏలూరు జిల్లాలో ప్రాజెక్ట్ డైరెక్టర్, డి ఆర్ డి వో గా పనిచేసి, బదిలీపై డీడీఓ క్యాడర్‌లో జిల్లా విజిలెన్స్ అధికారిగా తూర్పు గోదావరి జిల్లాకు వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎమ్ నాగ మహేశ్వర రావు, ఇతర సిబ్బంది ఆయనను కలిసి అభినందనలు తెలిపారు.

# ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, నాదెండ్ల భాస్కర్ రావు కు నివాళులు అర్పించిన బొలిశెట్టి





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. ఏప్రిల్ 23:**జనసేన పార్టీ పి ఎ సి చైర్మన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తండ్రి గారైన, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, సీనియర్ రాజకీయ నాయకులు శ్రీ నాదెండ్ల భాస్కర్ రావు మరణం వార్త విని హుటాహుటిన హైదరాబాద్ బయలుదేరి వారి పార్థివ దేహానికి నివాళులు అర్పించి మనోహర్ గారికి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ శాసనసభ్యులు తాడేపల్లిగూడెం. ఈ కార్యక్రమంలో ఉంగుటూరు శాసనసభ్యులు ధర్మరాజు, నరసాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ చాగంటి చిన్న , ఆర్టీసీ రీజినల్ డైరెక్టర్ - జోన్ -2 శ్రీ రెడ్డి అప్పలనాయుడు జనసేన నాయకులు పాల్గొన్నారు.

# ఆస్తి పన్ను వసూళ్లపై కమిషనర్ రాహుల్ మీనాకు ప్రశంస



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఏప్రిల్ 23:**ఆస్తి పన్ను వసూళ్లకు సంబంధించి 2025-26 ఆర్థిక సంవత్సరానికి కార్పొరేషన్ లలో రాజమహేంద్రవరం రాష్ట్రంలో ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ మేరకు గురువారం విజయవాడలో పురపాలక శాఖ నిర్వహించిన కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా ప్రశంసలు అందుకున్నారు. మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్ కుమార్, సీడీఎంఎ సంపత్ కుమార్ నుంచి జ్ఞాపికను అందుకున్నారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ, ఆస్తి పన్ను రికార్డు స్థాయి వసూళ్లలో కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది కృషి ఎంతగానో ఉందన్నారు. ఇదే ఉత్సాహాన్ని రానున్న రోజుల్లోనూ కొనసాగిస్తామన్నారు. సకాలంలో పన్నులు చెల్లించిన ప్రజలకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు'
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

# రైతులకు వర్మీ కంపోస్ట్ ఎరువుల వినియోగంపై అవగాహన



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. ఏప్రిల్ 23:**పశ్చిమగోదావరి మరియు ఏలూరు జిల్లాలో అధిక మోతాదులో యూరియా మరియు డి.ఏ.పి వినియోగం జరగడం వలన నేల ఆరోగ్యం మరియు పంట ఉత్పాదకత తగ్గడం జరుగుతుంది. దీనికి ప్రత్యాయంగా సమతుల్య ఎరువులు వినియోగం, సేంద్రియ ఎరువులు వాడటం, పచ్చ రొట్టె ఎరువులు, జీవన ఎరువులు మరియు వర్మి కంపోస్టుల వినియోగించడం ద్వారా రైతులు అవసరమైన రసాయన ఎరువులు మాత్రం వాడడం వలన ఖర్చు తగ్గడంతో పాటు నేల ఆరోగ్యం, పంట ఉత్పత్తి మరియు వాతావరణ కాలుష్యాన్ని తగ్గించుకోవచ్చు. దీనిలో భాగంగా కృషి విజ్ఞాన కేంద్రం వెంకటరమణ గూడెం డాక్టర్ వై. ఎస్ ఎస. ఆర్ .హెచ్.యు, విశ్వవిద్యాలయం వారు ఏలూరు జిల్లాలో గల నాచుగుంట గ్రామంలో రైతులకు వర్మీ కంపోస్ట్ ఎరువుల వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం భాగంగా రైతులకు వానపాముల ఎరువుల తయారీ నిర్వహణ మరియు వినియోగం పూర్తిస్థాయిలో వాటి విధానాన్ని చేసి చూపించి రైతులకు వాటి లాభాలను తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ సి. హెచ్.కిరణ్ కుమార్ సీనియర్ శాస్త్రవేత్త మరియు అధిపతి, రైతులతో వానపాముల ఎరువుల వినియోగం వలన కలిగే లాభాలను తెలియజేశారు. డాక్టర్ శాస్త్రవేత్త మధ్యాహ్నం ఉద్యన పంటల్లో వానపాములు ఎరువుల వాడడం గూర్చి రైతులకు తెలియజేయడం జరిగింది.

# వచ్చే ఎన్నికల్లో ప్రతిపక్షాలకు మహిళల మూల్యం తప్పదు





- రాజమండ్రి ఎంపీ పురందేశ్వరి హెచ్చరిక
- మహిళా బిల్లును ఓడించిన నేపథ్యంలో కూటమి మహిళలు వినూత్న నిరసన

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఏప్రిల్ 23 :**పార్లమెంట్‌లో 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రతి పక్షాలు ఓడించిన నేపథ్యంలో బిజెపి మహిళా మోర్చ ఆధ్వర్యంలో గురువారం కూటమి పార్టీల మహిళలు నల్ల చీరలు ధరించి వినూత్నంగా నిరసన ప్రదర్శన చేశారు. నిరసన ప్రదనకు రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి నాయకత్వం వహించారు. స్థానిక పుష్కర ఘాట్ వద్ద కూటమి పార్టీల మహిళలు పెద్ద ఎత్తున హాజరయ్యి పాదయాత్రగా శివుని బొమ్మ , మెయిన్ రోడ్డు మీదుగా స్థానిక రాయల్ మసీదు వరకు చేరుకున్నారు. ఈ సందర్భంగా మహిళా బిల్లుకు వ్యతిరేకించిన ప్రతిపక్షాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఎంపీ శ్రీమతి పురందేశ్వరి మాట్లాడుతూ, దేశ మహిళలు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలకు ముందుకు వచ్చిన బిజెపి ప్రయత్నాలను ప్రతిపక్షాలు అడ్డుకోవడం దారుణమన్నారు. వచ్చే ఎన్నికల్లో మహిళల నుంచి భారీ మూల్యం చెల్లించుకుంటాయని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇండియా కూటమి కి మహిళల సాధికారత పట్ల చిత్తశుద్ధి లేదని బిల్లును ఓడించడంతోనే తెలుస్తుందన్నారు. ప్రధాని మోడీ ఆధ్వర్యంలో గత మహిళల, బాలికల సంక్షేమానికి ,అభివృద్ధికి ఎన్నో పథకాలను దేశవ్యాప్తంగా తీసుకువచ్చినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసు, బిజెపి అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, బిజెపి జిల్లా మహిళా అధ్యక్షురాలు పాలడుగుల శ్రీవిద్య, కూటమి పార్టీల నాయకురాళ్ళు, కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున పలువురు పాల్గొన్నారు.

# సాయిదీపిక నగర్ లో రూ. 28.50 లక్షలతో ఫ్రూట్ పార్క్ ప్రారంభం



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఏప్రిల్ 23:**నగర ప్రజలకు ఆరోగ్యంతో పాటు ఆహ్లాదాన్ని పంచేలా పార్కుల సుందరీకరణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు పేర్కొన్నారు. ప్యాకేజీ-1 లో భాగంగా 10వ వార్డులో రూ. 28.50 లక్షలతో అభివృద్ధి పరిచిన సాయిదీపిక నగర్ పార్కును (ఫ్రూట్ పార్క్) ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, నగర కమిషనర్ రాహుల్ మీనాతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారులతో కాసేపు సరదాగా షటిల్ ఆడి ఉత్తేజాన్ని నింపారు. అనంతరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో ఈ పార్కు అడవిని తలపించేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పార్క్ రూపురేఖలే మారిపోయినట్లు వెల్లడించారు. ఈ పార్క్ లో గ్రీనరీని ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. పార్కులో పండ్ల పేర్లు, వాటి ఉపయోగాల గూర్చి చిన్నారులు చెబుతుండటం సంతోషాన్ని కలిగించిందన్నారు. కాలనీవాసులు కమిటీగా ఏర్పడి పార్కును సంరక్షించు కోవలసిందిగా సూచించారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ, అన్ని వయసుల వారిని అలరించే విధంగా ఈ ఫ్రూట్ థీమ్ పార్క్ ను తీర్చిదిద్ది నగర ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. కమిషనర్ రాహుల్ మీనా మాట్లాడుతూ, నగరంలోని పార్కులను ప్రత్యేక థీమ్ లతో నగరవాసులను, పర్యాటకులను ఆకట్టుకునే రీతిలో తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. సాయిదీపిక నగర్ పార్కును విశాలమైన వాకింగ్ ట్రాక్, షటిల్ కోర్టు, యోగా ప్రాంగణం, ఓపెన్ జిమ్‌తో పాటు చిన్నారులకు ఆట వస్తువులు, పచ్చని గార్డెనింగ్ తో ఆహ్లాదకరంగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. చిన్నారులు పండ్ల పేర్లను గుర్తించి, వాటి ఉపయోగాలను తెలుసుకునే విధంగా బోర్డులు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, నగర పాలక సంస్థ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కోనసీమలో విద్యార్థుల హక్కుల ఉల్లంఘనపై ఎన్‌హెచ్‌ఆర్‌సీకి ఫిర్యాదు



**గంగవరం/ రంపచోడవరం, పెన్ పవర్, ఏప్రిల్ 23:**డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని మండపేట పట్టణంలో ఉన్న డా. పి.ఎస్.సి.ఎం జెడ్పీ ఉన్నత పాఠశాలలో బాలుర ప్రవేశాలను నిలిపివేయాలన్న నిర్ణయంపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ), ఢిల్లీకి ఫిర్యాదు చేసినట్లు హ్యూమన్ రైట్స్ వాచ్ డైరెక్టర్ బాలు అక్కిస తెలిపారు. ఈ ఫిర్యాదు డైరీ నెంబర్ 8812/×చీ/2026గా నమోదు అయిందన్నారు.మండపేటలోని ఈ పాఠశాలలో ప్రస్తుతం 447 మంది విద్యార్థులు చదువుకుంటుండగా, వారిలో 91 మంది బాలురు ఉన్నారు. పాలివాల విద్యాసాగర్ (14) సహా మరో 90 మంది బాలురు ఈ పాఠశాలలో చదువుతున్నారని పేర్కొన్నారు. ఈ పాఠశాల పరిధిలో సుమారు 12,500 మంది ఎస్సీ, ఎస్టీ, వెనుకబడిన వర్గాల ప్రజలు నివసిస్తున్నారని తెలిపారు.ఏప్రిల్ 18న జిల్లా విద్యాశాఖ అధికారి పి. నాగేశ్వరరావు ఆర్‌సీ నెం. 794/ఎ1/2026 ద్వారా 2026-27 విద్యా సంవత్సరం నుంచి ఈ పాఠశాలలో బాలురను చేర్చుకోవద్దని, ప్రస్తుతం చదువుతున్న బాలురను ఇతర పాఠశాలల్లో చేర్చాలని మండపేట మండల విద్యాధికారికి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.ఈ నిర్ణయం బాలల మానవ హక్కులకు విరుద్ధమని, అలాగే ఉచిత మరియు నిర్బంధ విద్య హక్కు చట్టం--2009ను ఉల్లంఘించడమేనని ఫిర్యాదులో పేర్కొన్నారు. బాలురను ఇతర పాఠశాలకు పంపడం వల్ల వారు బడి మానేసే ప్రమాదం ఉందని, దూరప్రాంత పాఠశాలకు వెళ్లాల్సి రావడం వల్ల ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.కాబట్టి, సంబంధిత ఉత్తర్వులను తక్షణమే నిలిపివేసి, బాలురను అదే పాఠశాలలో కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని ఎన్‌హెచ్‌ఆర్‌సీని అభ్యర్థించినట్లు బాలు అక్కిస తెలిపారు.

# అక్రమ మద్యం, బెల్ట్ షాపులపై కఠిన చర్యలు






✸ ఎక్సైజ్ కమిషనర్ శ్రీధర్

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఏప్రిల్ 23:**అక్రమ మద్యం, బెల్ట్ షాపులపై కఠిన చర్యలు
ఎక్సైజ్ కమిషనర్ శ్రీధర్
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రొహిబిషన్ , ఎక్సైజ్ కమిషనర్ సిహెచ్ శ్రీధర్ గురువారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని ఎక్సైజ్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఎక్సైజ్ విధానం అమలు తీరు, ఆదాయ వృద్ధి, నేరాల నియంత్రణ తదితర అంశాలపై సమగ్రంగా కమిషనర్ సీహెచ్ శ్రీధర్ విశ్లేషించారు. సురక్షా యాప్ వినియోగం, ఆఫ్‌టేక్ వివరాలు, సిబ్బంది సామర్థ్యం, షాపులు, బార్లు నిర్వహణ, నమూనాల సేకరణ, గత సంవత్సరం- ప్రస్తుత సంవత్సరం వృద్ధి , రెవెన్యూ సేకరణ అంశాలను సమీక్షించారు.

కమిషనర్ శ్రీధర్ మాట్లాడుతూ అక్రమ మద్యం తయారీ, బెల్ట్ షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి స్టేషన్ హౌస్ ఆఫీసర్ తమ పరిధిలో నేరాల నియంత్రణపై వ్యక్తిగత బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు.

సురక్షా యాప్ వినియోగం తప్పనిసరి...

సురక్షా యాప్ ద్వారా డిపో నుంచి వినియోగదారుడి వరకు ప్రతి మద్యం సీసా ట్రాకింగ్ జరుగుతుందని, అన్ని షాపులు, బార్లలో స్కానింగ్ శాతం 100 శాతం ఉండాలని సూచించారు. స్కానింగ్ లో లోపాలు ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని హెచ్చరించారు.షాపులు, బార్లపై కఠిన తనిఖీలు అనుమతులు పొందిన మద్యం షాపులు, బార్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, టైమింగ్స్, పరిమితులు కచ్చితంగా పాటించాలన్నారు. నాణ్యత నియంత్రణలో మద్యం నమూనాలను తరచుగా సేకరించి ప్రయోగశాలలకు పంపించాలని ఆదేశించారు.రెవెన్యూ -- నేరాల సంబంధం గత, ప్రస్తుత సంవత్సరాల వృద్ధి పోలికలో, చట్టబద్ధ ఆదాయం పెరుగుదల అక్రమ కార్యకలాపాల నియంత్రణపై ఆధారపడి ఉంటుందన్నారు. ఒక ప్రాంతంలో నేరాలు పెరిగి, అరెస్టులు లేకపోతే అది నిర్లక్ష్యానికి సంకేతమని హెచ్చరించారు. ప్రతి స్టేషన్‌లో సిబ్బంది, వినియోగంపై సమీక్షించి, రైడ్లు, పహారా చర్యలు సమర్థంగా చేపట్టాలని సూచించారు.సమీక్ష అనంతరం ఫీల్డ్ స్థాయిలో సురక్షా యాప్ వినియోగాన్ని పరిశీలించి, షాపు సిబ్బంది వినియోగదారులకు యాప్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని ఆదేశించారు.

తమ పరిధిలో అక్రమ మద్యం నియంత్రణలో విఫలమయ్యే అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు.

ఈ సమావేశంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఎక్సైజ్ శాఖ జిల్లా అధికారులు, స్టేషన్ హౌస్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

## గంగవరం--వై.రామవరం మండలాల్లో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**గంగవరం, పెన్ పవర్, ఏప్రిల్ 23:**విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు (ట్రీ ట్రిమ్మింగ్) పనుల నేపథ్యంలో గంగవరం మరియు వై.రామవరం మండల పరిసర ప్రాంతాల్లో నేడు (శుక్రవారం, ఏప్రిల్ 24) తాత్కాలికంగా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.33 కేవీ గంగవరం ఫీడర్, 33 కేవీ వై.రామవరం ఫీడర్లలో నిర్వహణ పనులు చేపడుతున్నందున ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.వి. రమణ పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్ సత్యవతికి ఘన సన్మానం



**గంగవరం, పెన్ పవర్, ఏప్రిల్ 23:**గంగవరం మండలం అడ్డపల్లి చిన్న వీధిలోని గిరిజన ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చీడిపల్లి సత్యవతి పదవీ విరమణ సందర్భంగా గురువారం గ్రామస్తులు, తల్లిదండ్రులు ఘనంగా సన్మానించారు. అడ్డపల్లి చిన్న వీధి జీపీఎస్ పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో ఆమెను శాలువాతో సత్కరించి, నూతన వస్త్రాలు బహూకరించారు.ఈ సందర్భంగా పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ పల్లాల విజయకుమారి మాట్లాడుతూ, సత్యవతి విద్యాభివృద్ధి, పాఠశాల అభివృద్ధికి విశేషంగా కృషి చేశారని కొనియాడారు. మాజీ విద్యా కమిటీ చైర్మన్ కొక్కుల రాజమ్మ మాట్లాడుతూ, సత్యవతి మేడం మూడు తరాలుగా అడ్డపల్లి పాఠశాలలో సేవలు అందించి, అనేక మంది విద్యార్థులకు విద్యను అందించారని తెలిపారు.పాఠశాల సహ ఉపాధ్యాయురాలు వి. వెంకటలక్ష్మి మాట్లాడుతూ, సత్యవతి మేడంను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగుతామని, ఆమె పదవీ విరమణ తమకు బాధ కలిగించిందన్నారు. పాఠశాలను అభివృద్ధి పథంలో నడిపినందుకు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ కుక్కల చిన్నారి, ఆశా వర్కర్ పల్లాల మంగా, పాఠశాల స్థలదాత పల్లాల రామాయమ్మ, వార్డ్ మెంబర్ మడకం బుల్లి, గ్రామ పెద్దలు పల్లాల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మర్రిపాలెంలో ఎన్టీఆర్ ట్రస్ట్ ఉచిత వైద్య శిబిరం





**గంగవరం, పెన్ పవర్, ఏప్రిల్ 23:**పోలవరం జిల్లా రంపచోడవరం నియోజకవర్గం గంగవరం మండలం మర్రిపాలెం పంచాయతీ పరిధిలోని మర్రిపాలెం గ్రామంలో గురువారం ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఎన్టీఆర్ ట్రస్ట్ చైర్‌పర్సన్ నారా భువనేశ్వరి ఆదేశాల మేరకు ఈ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దూరప్రాంత గ్రామాల ప్రజలు బయటకు వెళ్లి వైద్యం చేయించుకోలేని పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లోనే శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గంగవరం మండలంలో ఈ నెలలో 10 గ్రామాల్లో షెడ్యూల్ ప్రకారం శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఎక్స్ ఎంపీపీ డాక్టర్ తీగల ప్రభ టిడిపి మండల కమిటీ అధ్యక్షుడు పల్లాల వెంకటరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో రోగులకు ఉచిత వైద్య పరీక్షలు చేసి, అవసరమైన మందులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పల్లాల వెంకటరెడ్డి, డాక్టర్ షనాయ, జీఎన్ఎం చిట్టి, ఫార్మసిస్ట్ స్వర్ణ, ఎన్టీఆర్ ట్రస్ట్ సిబ్బంది నాని, ఆశా వర్కర్లు లక్ష్మీ ప్రసన్న, రమణ తదితరులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## గ్రామాల్లో ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి

### అభివృద్ధి కార్యక్రమాలపై ఎమ్మెల్యే గోరంట్ల సమీక్ష



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఏప్రిల్ 23 :**గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. రూరల్ మండల పరిషత్ కార్యాలయం లో రూరల్ మండల అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రజా సమస్యలు పరిష్కరించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, గ్రామాల్లో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి, ప్రజా సమస్యలు పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కోట్లాది రూపాయలతో రోడ్లు డ్రైనేజీలు, పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, తనిఖీ చేస్తూ ఉండాలన్నారు. ప్రజా అవసరాలకు అనుగుణంగా అధికారులు పనితీరు ఉండాలని, మౌలిక సదుపాయాల సమస్యలు తన దృష్టికి తీసుకురావాలన్నారు. పంచాయతీలో బకాయిలు, పన్నులు వసూలు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రుడా సెక్రెటరీ సాయిబాబు, ఎంపీడీవో సునీల్ ఆర్మ్ స్ట్రాంగ్, ఆర్డబ్ల్యూఎస్ డీ.ఈ శ్రీనివాస్, డిప్యూటీ ఎంపీడీవో అమ్మి రాజు, పి.ఆర్ ఏ.ఈ.లు సంపత్ కుమార్, రమేష్, అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కోరుకొండ పాండవుల మెట్ట దగ్గర పెద్ద పులి సంచారం..





✸ క్షేత్రస్థాయిలో పర్యటించి అధికారులను అప్రమత్తం చేసిన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ..
✸ కోరుకొండ, సీతానగరం ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..

**కోరుకొండ, పెన్ పవర్, ఏప్రిల్ 23:**కోరుకొండ మండలం కాపవరం గ్రామం పాండవుల మెట్ట వద్ద గురువారం ఉదయం పెద్దపులి కదలికలు గుర్తించిన నేపథ్యంలో రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పులిసంచరిస్తున్నట్లుగా భావిస్తున్న ప్రాంతాలను పరిశీలించిన ఆయన, అటవీశాఖ అధికారులతో కలిసి పరిస్థితిని సమీక్షించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడుతూ ప్రజల రక్షణే ప్రథమ ప్రాధాన్యతని,పులిని బంధించేందుకు అవసరమైన అన్ని చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు. బోన్లు ఏర్పాటు చేయడం, ట్రాప్ కెమెరాల ద్వారా పులి కదలికలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.పులి సంచారం ఉన్నట్లు గుర్తించిన కీలక ప్రాంతాల్లో తక్షణమే అధునాతన బోన్లు, ఎరలను ఏర్పాటు చేయాలి. నైట్ విజన్ కెమెరాల ద్వారా పులి కదలికలను 24 గంటల పాటు నిశితంగా పర్యవేక్షించాలి. గ్రామాల్లో అటవీశాఖ సిబ్బందితో నిరంతరం గస్తీ (పాట్రోలింగ్ ) నిర్వహించి ప్రజల్లో ధైర్యం నింపాలి. ఏవైనా అత్యవసర పరిస్థితులు ఎదురైతే తక్షణమే స్పందించేలా క్విక్ రెస్పాన్స్ టీమ్స్ అందుబాటులో ఉంచాలని ఆదేశాలు జారీ చేసారు.కోరుకొండ మరియు సీతానగరం ప్రజలు మరియు రైతులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ కోరారు.ముఖ్యంగా రాత్రి సమయాల్లో పొలాలకు వెళ్లవద్దని, ఒంటరిగా బయట తిరగవద్దని సూచించారు.పశువుల సంరక్షణ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పులి కదలికలు ఎక్కడైనా గమనిస్తే వెంటనే అటవీశాఖ అధికారులకు లేదా స్థానిక నాయకులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.గత 3 రోజులుగా పులి ఏ విధమైన ఆహారం తీసుకోలేదని ఈ రోజు ఆహారం కోసం వేటాడే అవకాశం ఉన్నందున ప్రజలందరూ చాలా అప్రమత్తంగా ఉండాలని తెలియజేసారు.ప్రజలెవరూ ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం మరియు అటవీశాఖ యంత్రాంగం నిరంతరం నిఘా ఉంచిందని, త్వరలోనే పులిని బంధించి సురక్షిత ప్రాంతానికి తరలించేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే బల రామకృష్ణ తెలియజేసారు.

## దోసకాయలపల్లి నూతన శివాలయంలో భారీ అన్నదానము..



తెదేపా జిల్లా అధ్యక్షులు బొడ్డు వెంకటరమణ చౌదరి ప్రత్యేక పూజలు..

**కోరుకొండ, పెన్ పవర్, ఏప్రిల్ 23:** దోసకాయల పల్లి నూతనగా నిర్మించిన శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద భారీ అన్నదాన కార్యక్రమం ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు బొడ్డు వెంకటరమణ చౌదరి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో భక్తులకు భోజనం వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో మార్ని రాము, మార్ని బుజ్జి, సూదిన గంగాధర్, మరియు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## చదువు అనే ఆయుధాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. హెచ్ఎం పోసియ్య.

**గోపాలపురం,పెన్ పవర్, ఏప్రిల్ 23.**చదువు అనే ఆయుధాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని తద్వారా అభివృద్ధి చెందాలని మండలంలోని పెద్దాపురం పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు కాకి పోసియ్య అన్నారు. పాఠశాల వార్షికోత్సవం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోసియ్య విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. నేటి బాలలే రేపటి పౌరులకు విద్యార్థులు బాల్యం నుండి నాణ్యమైన విద్యను అభ్యసించాలన్నారు. ప్రాథమిక స్థాయిలో విద్య విద్యార్థులకు పునాది వంటిది అన్నారు. తల్లిదండ్రులు తమ బిడ్డల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరిని చదివించి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి అనేక పథకాలను ప్రవేశపెడుతుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన జరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరు తమ బిడ్డల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చి వారి అభివృద్ధికి కారకులు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సనపల రాజశేఖర్, రత్నమని , సిఆర్పి కొయ్య నాగరాజుతదితరులు పాల్గొన్నారు.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# చిన్నారుల ఆరోగ్య భవిష్యత్తుకై 'శివ పోషణ' అవగాహన సదస్సు





**ఆత్రేయపురం పెన్ పవర్ ఏప్రిల్ 23:**మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చిన్నారుల ఆరోగ్యకర భవిష్యత్తు లక్ష్యంగా "శివ పోషణ" అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గురువారం ర్యాలి గ్రామంలోని కోడ్ నెంబర్ 63, 3–జ ఏరియా అంగన్వాడీ కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమానికి శాఖ అధికారి ఏ. గజలక్ష్మి అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా చిన్నారుల తొలి రెండేళ్ల వయస్సు మెదడు అభివృద్ధికి అత్యంత కీలకమని నిపుణులు వివరించారు. పిల్లల ఎదుగుదలలో 80 శాతం మెదడు అభివృద్ధి ఈ దశలోనే జరుగుతుందని పేర్కొన్నారు. అధిక స్క్రీన్ టైమ్ చిన్నారుల మానసిక, సామాజిక అభివృద్ధిపై ప్రతికూల ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. అలాగే ప్యాక్ చేసిన జంక్ ఫుడ్ వల్ల పిల్లల ఆరోగ్యంపై కలిగే దుష్ప్రభావాలను ర్యాలి పీహెచ్సీ వైద్యుడు డాక్టర్ సాయి కిరణ్ వివరంగా తెలియజేశారు.

పిల్లలకు పోషకాహారం అందించడం, తల్లిదండ్రులు పిల్లలపై నిరంతర శ్రద్ధ వహించడం ఎంతో అవసరమని అధికారులు సూచించారు. కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలు, 0––6 సంవత్సరాల చిన్నారుల తల్లిదండ్రులు, అంగన్వాడీ సిబ్బంది, ఏఎన్ఎంలు పాల్గొని ఆరోగ్య సూచనలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పిల్లల పోషణ, ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడమే లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

## విద్యా వెలుగులతో మెరిసిన 'సాంగ్ ఆఫ్ జాయ్' వార్షికోత్సవం



**ఆత్రేయపురం పెన్ పవర్ ఏప్రిల్ 23:**డా.బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామం విద్యా సంబరాలతో కళకళలాడింది. గ్రామంలోని సాంగ్ ఆఫ్ జాయ్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించగా విద్యార్థుల ప్రతిభ, విద్యా ప్రాధాన్యత, సామాజిక సేవల సందేశాలతో కార్యక్రమం ఆకట్టుకుంది. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, ప్రతిభా ప్రదర్శనలతో సభా ప్రాంగణం ఉత్సాహభరితంగా మారింది.

ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ పి.ఎస్.ఆర్. రెడ్డి జైపాల్ మాట్లాడుతూ సమాజ మార్పుకు విద్యే ప్రధాన ఆయుధమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో సంస్థ పనిచేస్తోందని తెలిపారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, విలువలు, సామాజిక బాధ్యత పెంపొందించే దిశగా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని చెప్పారు.

స్కూల్ కరస్పాండెంట్ పల్నాటి ప్రవీణ్ మాట్లాడుతూ సాంగ్ ఆఫ్ జాయ్ విద్యార్థులు విద్యా, ఉపాధి రంగాల్లో ఉన్నత స్థానాలు సాధించడం సంస్థకు గర్వకారణమని అన్నారు. పేద , వెనుకబడిన వర్గాల పిల్లలకు విద్య అందించడం ద్వారా వారి జీవితాల్లో మార్పు తీసుకురావడమే తమ లక్ష్యమని వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ పృథ్వీరాజ్ మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు ఉన్న కుటుంబాల పిల్లలకు విద్యా అవకాశాలు కల్పించడం గొప్ప సేవ అని కొనియాడారు. విద్య ద్వారా మాత్రమే సమాజంలో అసమానతలను తగ్గించవచ్చని అభిప్రాయపడ్డారు. మరో అతిథి డాక్టర్ ఆనంద్ మాట్లాడుతూ అనాథ పిల్లలకు ఉచిత విద్య అందించడం మానవతా దృక్పథానికి నిదర్శనమని పేర్కొన్నారు.అనంతరం వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అవార్డులు, ప్రశంసాపత్రాలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

## జయంతి వేడుకలలో సిహెచ్ లో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ,



**గండేపల్లి, పెన్ పవర్, ఏప్రిల్ ,23:**కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో రోగులకు రొట్టెలు పండ్లు పంపిణీ చేసిన సీతానగరం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ యువ నేత స్వర్గీయ గల్లా నాగరాజు (బాబి) 29వ జయంతి వేడుకలను కుటుంబ సభ్యులు గురువారం ఘనంగా నిర్వహించారు. సిహెచ్ సూపర్డెంట్ ప్రణీత్ చేతుల మీదగా రోగులకు రొట్టెలు, పండ్లు అందించారు. అదేవిధంగా అన్నా క్యాంటీన్లో ఉదయం ఉచిత అల్పాహారము, మధ్యాహ్నం ఉచిత భోజనము అందించి పలువురికి ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ స్వర్గీయ గల్లా నాగరాజు మన మధ్య లేకున్నా ప్రజల గుండెల్లో ఉన్నారని వారు ఈ సందర్భంగా తెలిపారు. జయంతి వేడుకలను పురస్కరించుకుని రోగులకు పండు పంపిణీ, అన్నా క్యాంటీన్లో ఉచిత అల్పాహారము భోజనము అందించడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగరాజు కుటుంబ సభ్యులు, స్నేహితులు ఉన్నారు.

# సాటిలైట్ సిటీ లో వైభవంగా శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ట



**ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎమ్మెల్యే గోరంట్ల, ఆధ్యాత్మికవేత్త కంబాల**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఏప్రిల్ 23 :**రూరల్ మండలం సాటిలైట్ సిటీ గ్రామంలో సి బ్లాక్ లో నూతనంగా నిర్మించిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో గురువారం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి విగ్రహ ప్రతిష్ట, కలశం ప్రతిష్ట, ధ్వజస్తంభం ప్రతిష్ట కార్యక్రమాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ ప్రాంతమంతా ఓం నమో వెంకటేశాయ కీర్తనలతో మారు మోగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, శ్రీమతి ఝాన్సీ లక్ష్మి దంపతులు హాజరయ్యారు. వారితోపాటు ప్రముఖ ఆధ్యాత్మికవేత్త విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు బిజెపి నాయకులు కంబాల శ్రీనివాసరావు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. సాటిలైట్ సిటీ వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే గోరంట్ల కోరగా ఆధ్యాత్మిక, ధార్మికవేత్త కంబాల శ్రీనివాసరావు వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి 7 లక్షలు రూపాయలు, విగ్నేశ్వర ఆలయానికి 3 లక్షలు భారీ విరాళం అందించారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి విరాళం చెక్కులను ఆలయ కమిటీ సభ్యులకు కంబాల శ్రీనివాసరావు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ శాటిలైట్ సిటీలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం బడుగు, బలహీన వర్గాలు, దాతల సహకారంతో ఆలయ నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. ఈ ఆలయ నిర్మాణానికి రూ.10 లక్షల రూపాయలు విరాళం ఇచ్చిన కంబాల శ్రీనివాసరావుని అభినందించారు. ఆయన చేస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఎంతోమందికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయన్నారు. అనంతరం కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ మతమార్పిడిలు అరికట్టడం కోసం, సనాతన ధర్మ పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తూ ఉంటానన్నారు. రంపచోడవరం, జగ్గంపేట, రాజానగరం, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలలో, శిధిల ఆలయాల అభివృద్ధికి, నూతన ఆలయాల నిర్మాణానికి, కృషి చేయడం జరుగుతుందన్నారు. అనంతరం భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో , రాష్ట్ర కార్యదర్శి మజ్జి పద్మావతి, రూరల్ మండల తెదేపా అధ్యక్షులు మత్సేటి ప్రసాద్, రాష్ట్ర కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్లు పండూరి అప్పారావు, దాలిపర్తి వేమన, నిచ్చెనకోళ్ల సత్తిబాబు, వాసిరెడ్డి బాబి, నిమ్మలపూడి గోవింద్, ఎమ్మెస్సార్ శ్రీను, పిల్ల తనుజ, పత్తి మంగ, దారా అన్నవరం నాయకులు భక్తులు పాల్గొన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## పొగాకు రైతులను నిట్టనిలువున ముంచిన జి.పి.ఐ. కంపెనీ



**-మండలరైతులకు ఎల్లపుడూ తోడుగా టిడిపి**

**వి.ఆర్.పురం పెన్.పవర్.ఏప్రిల్.23:**చింతూరు డివిజన్,పరిధిలో వేలఎకరాల్లోపొగాకు సాగుచేసిన రైతులనుజి.పి.ఐ.కంపెనీ వేదిస్తుదని, ముందుగా రైతులతోచేసుకున్న ఒప్పందం ప్రకారం పొగాకుసాగు చేసినప్పటికీ,అనేక నిబంధనలసాకు తోరైతులను సాగు సమయంలో తీవ్రఇబ్బందులు గురిచేస్తున్నారని,పొగాకు పంట చేతికి అందినసమ యంలో కొనుగోలు చేసే విషయంలో రాజకీయరంగు పులుముతూ,రైతులను మనోవేదనకు గురిచేస్తున్నా రని,పంటచేతికు అందిన నెలరోజులు గడుస్తున్నప్ప టికీ,ఇంటికి చేర్చుకున్న పొగాకుబేళ్లను కొనుగోలు చేయకుండా కంపెనీ,కాలయాపన చేస్తుందని,వి.ఆర్.పురం,కూనవరం,ఎటపాక,మండలాలకు చెందినపొగాకురైతులను నిలువునా ముంచేస్తుందని,రైతులతోరాజకీయం చేస్తే సహించేది,లేదని,వి.ఆర్.పురం మండలతెలు గుదేశం పార్టీ హెచ్చరిస్తూ,ఈ విషయమై ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి జి.పి.ఐ కంపెనీపై చర్యలు తీసుకునే విధంగా కోరుతామని,తెలియజేస్తూఒక ప్రకటనలో తెలిపారు.జి.పి.ఐ.కంపెనీ వ్యవహారంపై మండల తెలుగుదేశం పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నామని,మండల రైతుల పక్షాన ఎల్లపుడూ మండల తెలుగుదేశంపార్టీ తోడుగా ఉంటుందని, రైతులకు భరోసా ఇచ్చారు.

# దళితుల సమస్యలపై ఐటిడిఏ పీఓ, డాక్టర్ జమాల్ ఖాన్ను కలిసిన సంఘ నాయకులు






**చింతూరు, పన్ పవర్ ఏప్రిల్ 23 :**చింతూరు ప్రాంతంలో నివసిస్తున్న దళిత కుటుంబాలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ దళిత కుటుంబ సంక్షేమ సంఘం నాయకులు చింతూరు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి (పీఓ)ను కలిసి వినతి పత్రం సమర్పించారు.

సంఘ నాయకులు తెలిపిన వివరాల ప్రకారం, చింతూరులో ఎన్నో ఏళ్లుగా నివసిస్తున్న దళితులకు అత్యవసరమైన స్మశాన వాటిక లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా, దళిత కుటుంబాల్లో ఎవరైనా మరణిస్తే పాతిపెట్టడానికి స్థలం లేక ఇబ్బందులు పడుతున్నామని విన్నవించారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా స్మశాన వాటిక కోసం తగిన స్థలం కేటాయించాలని పీఓను కోరారు. అదేవిధంగా, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్టించేందుకు చింతూరులో ముంపు లేని ప్రదేశంలో స్థలం కేటాయించాలని కూడా విజ్ఞప్తి చేశారు. ఇదే అంశంపై చింతూరు జెకె సిటీ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ జమాల్ ఖాన్ను కూడా సంఘ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలను వివరించారు. తమ సమస్యను పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి, స్మశాన వాటిక మరియు అంబేద్కర్ విగ్రహ స్థలం కేటాయింపుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘం అధ్యక్షుడు మెల్లెం నాగేంద్రం, ప్రధాన కార్యదర్శి ఇంటి సుదర్శన్ కుమార్ తదితర నాయకులు పాల్గొన్నారు. పలు సమస్యలను విన్నవిస్తూ వినతి పత్రం అందజేశారు.

## పర్యావరణ పరిరక్షణకు అందరూ మొక్కలు పెంచుదాం



**జాతీయ పర్యావరణ మిత్ర గంగాధర్**

**గండేపల్లి, పెన్ పవర్, ఏప్రిల్ 23:** గండేపల్లి మండలం సూరంపాలెం: ఆదిత్య యూనివర్సిటీ ధరిత్రి దినోత్సవం సందర్భంగా ఆదిత్య యూనివర్సిటీ ప్రెస్ రిలేషన్ ఆఫీసర్ జాతీయ పర్యావరణ మిత్ర అవార్డు గ్రహీత తోటకూర గంగాధర్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ "తరువు త్యాగానికి గురువు" తరువులు పెంచుదాం ధరణిని కాపాడుదాం.. అంటూ వాతావరణ మార్పులు పరిష్కరించడానికి మరియు జీవవైవిధ్యాన్ని రక్షించడానికి సమిష్టి కృషి యొక్క ప్రాముఖ్యతను గురించి వివరించారు. 55 సంవత్సరాల క్రితం 1970 లోనే ప్రపంచ పర్యావరణ సంస్థ ధరిత్రి ని కాపాడుకోవాలని ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఈ ధరిత్రి దినోత్సవం నిర్వహిస్తున్నారు అని తెలియజేసారు. అడవులు నరికి వేయడం వల్ల క్రమక్రమంగా అటవీ భూమి అంతరించి జంతుజాలం అంతరించిపోతుంది తరువులు తరిగిపోవడం వల్ల వాతావరణంలో ఉష్ణోగ్రతలు అధికమవుతున్నాయి.తద్వారా మానవులే కాకుండా సమస్త జీవులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవలసి వస్తుంది.. సకాలంలో వర్షాలు కురవక పంటలకు తీవ్ర నష్టం ఏర్పడుతుంది.. వీటన్నింటికీ పరిష్కారం ఒక్కటే మొక్కలు విరివిగా పెంచడం, ప్లాస్టిక్ వాడకాన్ని నివారించడం ద్వారా వాతావరణ సమతుల్యాన్ని కాపాడుకోవడానికి అందరూ కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ శారదా రామకృష్ణ సేవా సమితి సభ్యులు తోటకూర దుర్గా లక్ష్మి, పెంటకోట గంగాధర్,నాగదేవి తదితరులు పాల్గొన్నారు.

## ఆదిత్య యూనివర్సిటీ లో ఎర్త్ వీక్ ఉత్సవాలు






**గండేపల్లి, పెన్ పవర్, ఏప్రిల్, 23:** గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ నందు ఎకో క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ఎర్త్ వీక్ సంబరాలు సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటిన డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ డా. ఎం.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని పుట్టిన రోజు,పెళ్లి రోజు తదితర పర్వదినాలలో మొక్కలు నాటడం మొక్కలు పంపిణీ చేయడం వంటి కార్యక్రమాలు చేపట్టి ప్రకృతి పరిరక్షణ కొరకు మొక్కవోని దీక్షతో అందరూ ముందుకు రావాలని అన్నారు. కన్న తల్లి ఋణం... మాతృభూమి ఋణం ఎప్పటికీ తీర్చుకోలేము మనం నేడు చేస్తున్న కాలుష్యం వల్ల భావితరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించలేమని అది గుర్తించే నాటి అమెరికా .."సెనేటర్ గెరాల్డ్ నెల్సన్" ధరిత్రి దినోత్సవం (ఎర్త్ డే) కు రూపకల్పన చేశారు అని డా. ఎం.ఎస్.రెడ్డి అన్నారు. మన భవిష్యత్తు మన చేతుల్లోనే ఉంది,అందుకే ప్రతి ఒక్కరు మొక్కలు పెంచడం ద్వారా భావితరాలకు స్వచ్ఛమైన ప్రాణవాయువును,ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రో.వైస్ ఛాన్సలర్ డా.ఏ. రమేష్, రిజిస్ట్రార్ డా.జి.సురేష్,డీన్ లు డా. డి .కిషోర్, ప్రో.వి.సత్యనారాయణ, కో క్లబ్ కో.ఆర్డినేటర్. డా. బి.హెచ్.వరప్రసాద్,ప్రో.అన్నపూర్ణ,ఉపాధ్యాయ ులు ఎకో క్లబ్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

# సన్‌రైజర్స్‌లోకి ప్యాట్ కమిన్స్.. కెప్టెన్సీ మార్పుపై SRH కన్ఫ్యూజన్





**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026 ఎడిషన్ లో సన్‌రైజర్స్ హైదరా బాద్ అద్భుతంగా ఆడుతుంది. వరుసగా 3 విజయా లతో పాయింట్ల పట్టికలో దూసుకుపోతోంది. కానీ జట్టు విజయాలతో ముందుకు సాగుతున్న తరుణంలో కెప్టెన్సీకి సంబంధించి ఓ పెద్ద చర్చ స్టార్ట్ అయింది. రెగ్యులర్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ జట్టుతో చేరడంతో ప్రస్తుతం కెప్టెన్‌గా ఉన్న ఇషాన్ కిషన్ నుంచి బాధ్యతలు తప్పుకునే ఛాన్స్ ఉందనేది.. అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఈ సీజన్ ఆరంభంలో ప్యాట్ కమిన్స్ గాయంతో అందుబాటులో లేకపోవడంతో జట్టు యాజమాన్యం అనూహ్యంగా యువ ప్లేయర్ ఇషాన్ కిషన్‌కు సారథ్య బాధ్యతలు అప్పగించింది. ఆరంభంలో కొన్ని ఓటములు ఎదురైనప్పటికీ.. ఇషాన్ తన నాయకత్వ పటిమతో జట్టుకి మళ్లీ విజయాలు అందించాడు. ముఖ్యంగా బౌలర్లను ఉపయోగించుకోవడంతో పాటు ఫీల్డింగ్ సెట్ చేయడంలో కిషన్ చూపిన పరిణతి చూస్తున్నాడు. ఇషాన్ కిషన్ కెప్టెన్సీని కొనసాగించాలని మాజీ క్రికెటర్లు గట్టిగా వాదిస్తున్నారు. హైదరాబాద్ జట్టు ప్యాట్ కమిన్స్ వైపు వెళ్లాలనే ఆలోచన చేయొద్దని సూచించారు. ప్రస్తుత సెటప్‌లో ఇషాన్ సారథ్యంలో జట్టు చాలా సమతుల్యంగా కనపడుతుంది. గత 5 మ్యాచ్‌ల్లో 4 గెలిచిన టీమ్ లో మార్పులు చేయడం అనవసరం అని హర్భజన్ సింగ్ పేర్కొన్నాడు. ప్యాట్ కమిన్స్ 2024లో జట్టును ఫైనల్‌కు చేర్చినప్పటికీ.. ప్రస్తుత ఫామ్ ఇషాన్‌కు అనుకూలంగా ఉందన్నాడు. మాజీ కోచ్ సంజయ్ బంగర్ కూడా ఇషాన్ కిషన్ కి సపోర్టు చేశాడు. ప్యాట్ కమిన్స్ వెన్నునొప్పి గాయంతో బాధపడుతున్నాడని.. దీనివల్ల అతను గత టీ20 ప్రపంచ కప్‌కు కూడా దూరంగా ఉన్నాడని గుర్తు చేశారు. ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న కమిన్స్.. ఐపీఎల్ లాంటి సుదీర్ఘ టోర్నీలో పూర్తిస్థాయిలో

ఫిట్‌గా ఉంటాడా అన్నది అనుమానమేనని సంజయ్ పేర్కొన్నారు. ఇషాన్ కిషన్ గ్రౌండ్లో ఆటను నియంత్రించే తీరు అద్భుతంగా ఉందని కొనియాడారు. హైదరాబాద్ జట్టు యాజమాన్యం ఇప్పుడు కన్ఫ్యూజన్ లో పడింది. ఓ వైపు ప్యాట్ కమిన్స్ అందుబాటులోకి రావడం.. మరోవైపు వరుస విజయాలతో జోరు మీదున్న యంగ్ కెప్టెన్ ఇషాన్ కిషన్.. ఎవరినీ కెప్టెన్సీగా ఉంచాలనే నిర్ణయంపై మదనపడుతుంది. మరి ఆరెంజ్ ఆర్మీ అనుభవానికి ఓటేస్తుందో లేక విజయం తెచ్చిపెడుతున్న యువ రక్తాన్ని నమ్ముతుందా అనేది వేచి చూడాలి.

# మ్యాచ్‌కు ముందు కార్టూన్లు చూస్తా: వైభవ్ సూర్యవంశీ

## ప్రతి మ్యాచ్‌కు ముందు కార్టూన్లు చూస్తానని చెప్పి అందరినీ ఆశ్చర్యపరిచిన వైభవ్
## సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న యువ సంచలనం నిజాయతీ వ్యాఖ్యలు
## వేగవంతమైన 500 పరుగుల ఘనతలో మ్యాక్స్‌వెల్ ను అధిగమించిన సూర్యవంశీ



**హైదరాబాద్ పెన్ పవర్:** రాజస్థాన్ రాయల్స్ యువ సంచలనం 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ ఐపీఎల్‌లో సరికొత్త రికార్డులు సృష్టిస్తున్నాడు. నిన్న లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో అతను మరో అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకున్నాడు. ఈ మ్యాచ్‌లో కేవలం 8 పరుగులే చేసినప్పటికీ, ఐపీఎల్ చరిత్రలో 500 పరుగులు పూర్తి చేసిన అత్యంత పిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించాడు.

అంతేగాక ఎదుర్కొన్న బంతుల పరంగా వేగంగా ఈ మైలురాయిని చేరుకుని, ఆస్ట్రేలియా స్టార్ ఆటగాడు గ్లెన్ మ్యాక్స్‌వెల్ పేరిట ఉన్న రికార్డును కూడా వైభవ్ బద్దలుకొట్టాడు. ఈ ఘనత సాధించిన తర్వాత అతను పంచుకున్న విషయాలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. మ్యాచ్ అనంతరం మాట్లాడుతూ... "నా బుర్రలో పెద్దగా ఏమీ ఆలోచించను. ఇప్పటికీ ప్రతి మ్యాచ్‌కు ముందు కార్టూన్లు చూస్తాను. అది నాకు అలవాటు. అయితే, ఆటపైనే పూర్తి ఫోకస్ ఉంటుంది" అని నవ్వుతూ చెప్పాడు. చిన్న వయసులోనే స్టార్‌డమ్ వచ్చినా, తనలోని చిన్నపిల్లల అలవాటును నిజాయతీగా చెప్పడంతో నెటిజన్లు అతనిపై ప్రశంసలు కురిపిస్తున్నారు.

"తర్వాతి మ్యాచ్‌లో కచ్చితంగా బాగా ఆడతాను. ఈ విజయంతో రెండు పాయింట్లు సాధించాం. ప్లేఆఫ్స్ దిశగా ముందుకు వెళ్తాం" అని వైభవ్ ధీమా వ్యక్తం చేశాడు.

# ఫిఫా వరల్డ్ కప్‌లో రాజకీయ ప్రకంపనలు.. ఇరాన్ స్థానంలో ఇటలీకి అవకాశం?



**హైదరాబాద్ పెన్ పవర్:** ఫుట్‌బాల్ ప్రపంచంలోనే అతిపెద్ద ఈవెంట్ అయిన ఫిఫా వరల్డ్ కప్‌కు రాజకీయ వివాదాల సెగ తగిలింది. జూన్ 11 నుంచి ప్రారంభం కానున్న ఈ మెగా టోర్నమెంట్‌లో అర్హత సాధించిన ఇరాన్ జట్టును తప్పించి, దాని స్థానంలో ఇటలీని చేర్చాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రత్యేక ప్రతినిధి ఒకరు ఫిఫాకు సూచించినట్లు సంచలన వార్తలు వెలువడుతున్నాయి. పోప్ లియో ౩×ం పై ట్రంప్ చేసిన తీవ్ర వ్యాఖ్యల నేపథ్యంలో చెలరేగిన రాజకీయ వివాదాన్ని చల్లార్చేందుకే ఈ ప్రతిపాదన తెరపైకి వచ్చినట్లు తెలుస్తోంది. అమెరికా వలస విధానం, ఇరాన్‌తో యుద్ధం వంటి అంశాలపై పోప్ లియో ౩×ం వ్యతిరేకత వ్యక్తం చేయడంతో ట్రంప్ తన 'ట్రూత్ సోషల్' మీడియా వేదికగా ఆయనపై తీవ్ర విమర్శలు గుప్పించారు. "పోప్ నేరాలను అరికట్టడంలో బలహీనంగా ఉన్నారు. విదేశాంగ విధానంలో ఘోరంగా విఫలమయ్యారు" అని ట్రంప్ చేసిన పోస్ట్ ప్రపంచవ్యాప్తంగా దుమారం రేపింది. ముఖ్యంగా ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ ఈ వ్యాఖ్యలను "ఆమోదయోగ్యం కాదు" అని తీవ్రంగా ఖండించారు. ఈ పరిణామంతో ట్రంప్, మెలోనీ మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. ఫైనాన్షియల్ టైమ్స్ కథనం ప్రకారం దెబ్బతిన్న సంబంధాలను చక్కదిద్దే ప్రయత్నంలో భాగంగానే ఈ వరల్డ్ కప్ ప్రతిపాదన ముందుకు వచ్చింది. ట్రంప్ ప్రత్యేక ప్రతినిధి పాలో జంపొల్లి మాట్లాడుతూ.. "వరల్డ్ కప్‌లో ఇరాన్ స్థానంలో ఇటలీని చేర్చాలని నేను ట్రంప్, ఫిఫా అధ్యక్షుడు ఇన్ఫాంటినోలకు సూచించాను. నేను ఇటలీ సంతతికి చెందినవాడిని. అమెరికా ఆతిథ్యం ఇచ్చే టోర్నమెంట్‌లో అజూరీ (ఇటలీ జట్టు) ఆడటాన్ని చూడాలన్నది నా కల. నాలుగుసార్లు ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన ఇటలీకి ఆ అర్హత ఉంది" అని వివరించారు. విచిత్రమేమిటంటే వరుసగా మూడుసార్లు ప్రపంచకప్‌కు అర్హత సాధించడంలో ఇటలీ విఫలమైంది. ప్లే-ఆఫ్‌లో బోస్నియా హెర్జెగోవినా చేతిలో ఓడిపోయి చరిత్రలో తొలిసారిగా ఇలాంటి ఘోర పరాభవాన్ని మూటగట్టుకుంది. మరోవైపు ఇరాన్ వరుసగా నాలుగోసారి ప్రపంచకప్‌కు అర్హత సాధించింది. అయితే, అమెరికా, ఇజ్రాయెల్‌తో యుద్ధం నేపథ్యంలో తమ గ్రూప్ మ్యాచ్‌లను అమెరికా నుంచి మెక్సికోకు మార్చాలని మొదట ఫిఫాను కోరింది. ఆ తర్వాత దేశంపై జరుగుతున్న వైమానిక దాడుల కారణంగా టోర్నమెంట్‌లో పాల్గొనలేమని ఇరాన్ క్రీడా మంత్రి అహ్మద్ దొన్యమాలి అధికారికంగా ప్రకటించారు.

దీనిపై ట్రంప్ స్పందిస్తూ.. "ఇరాన్ జట్టుకు ప్రపంచకప్‌లోకి స్వాగతం. కానీ, వారి ప్రాణ భద్రత దృష్ట్యా వారు ఇక్కడ ఉండటం సబబు కాదని నేను భావిస్తున్నాను" అని 'ట్రూత్ సోషల్'లో పోస్ట్ చేశారు. షెడ్యూల్ ప్రకారం ఇరాన్ తన తొలి మ్యాచ్‌ను న్యూజిలాండ్‌తో సోఫై స్టేడియంలో ఆడాల్సి ఉంది. కానీ తాజా పరిణామాలతో అర్హత కోల్పోయిన ఇటలీకి అనూహ్యంగా తలుపులు తెరుచుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.

**నేహా శర్మ చిక్ మరియు సొగసైన స్టైల్ స్టేట్‌మెంట్‌లో స్టన్స్**



# రౌడీ జనార్ధన కోసం భారీ యాక్షన్ సీక్వెన్స్!



రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ నటిస్తున్న భారీ మాసీవ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ -రౌడీ జనార్ధన-. రవి కిరణ్ కోలా దర్శకత్వం వహిస్తున్నాడు. దిల్ రాజు అత్యంత భారీ స్థాయిలో నిర్మిస్తున్న ఈ మూవీ షూటింగ్ శర వేగంగా జరుగుతోంది. కీర్తి సురేష్ తొలి సారి విజయ్‌కి జోడీగా నటిస్తుండటం, విజయ్ ఫస్ట్ టైమ్ పక్కా మాస్ క్యారెక్టర్ చేస్తుండటంతో ఈ మూవీపై అంచనాలు భారీగానే ఉన్నాయి. ఉత్తరాంధ్ర నేపథ్యంలో సాగే ఈ సినిమాలో విజయ్ దేవరకొండ పలికే తూర్పు గోదావరి యాస ప్రధాన హైలైట్‌గా నిలవనుంది. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా టైటిల్ గ్లింప్స్ అంచనాల్ని పెంచేసింది. 80వ దశకంలో సాగే పొలిటికల్ యాక్షన్ డ్రామా ఇది. ఇందు కోసం డిఫరెంట్ మేకోవర్‌తో విజయ్ దేవరకొండ నటిస్తున్నాడు. టీజర్‌లో రౌడీ పాత్రలో విజయ్ సరికొత్తగా కనిపించిన తీరు అభిమానుల్ని, సినీ లవర్స్‌ని విశేషంగా ఆకట్టుకుంటూ సినిమాపై అంచనాల్ని పెంచేసింది. రాయలసీమ ప్రాంతంలో జరిగిన ఓ పొలిటికల్ ఎమోషనల్ పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా దర్శకుడు రవి కిరణ్ కోలా దీన్ని తెరకెక్కిస్తున్నాడు. విజయ్‌తో బ్లాక్ బస్టర్ హిట్‌ని అందించాలనే పట్టుదలతో దిల్ రాజు ఈ మూవీని ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. మే చివర్లో రామోజీ ఫిల్మ్ సిటీలో కొత్త షెడ్యూల్‌ని ప్రారంభించి సాంగ్‌తో పాటు భారీ యాక్షన్ సీక్వెన్స్‌ని పూర్తి చేయాలని టీమ్ ప్లాన్ చేస్తోంది. ఈ మూవీకి ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్ అత్యంత కీలకంగా నిలుస్తుందని ఇన్ సైడ్ టాక్. ఈ ఎపిసోడ్‌లో విజయ్ దేవరకొండ ఫుల్ యాక్షన్ మోడ్‌లో కనిపించి కేక పెట్టిస్తాడని తెలుస్తోంది. రౌడీలకే రౌడీగా విజయ్ దేవరకొండ నటిస్తున్న సినిమా కావడం, ఇందులో మునుపెన్నడూ లేనంతగా మాస్ క్యారెక్టర్‌లో విజయ్ దేవరకొండ నటిస్తుండటంతో అభిమానులు, సినీ లవర్స్ ఈ సినిమా కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. శరవేగంగా షూటింగ్‌ని పూర్తి చేసి ఇదే ఏడాది డిసెంబర్‌లో సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. గత కొంత కాలంగా వరుస ఫ్లాపుల్లో ఉంటూ తనదైన మార్కుని కోల్పోయిన విజయ్ దేవరకొండ ఈ మూవీతో స్ట్రాంగ్ కమ్ బ్యాక్ ఇవ్వాలని బలంగా కోరుకుంటున్నాడు. అందుకే ప్రతి విషయంలోనూ చాలా జాగ్రత్తలు తీసుకుంటూ ఈ సినిమా చేస్తున్నాడట. ఈ విషయాన్ని ఆ మధ్య విడుదల చేసిన టైటిల్ గ్లింప్స్‌తో ఫుల్ క్లారిటీ ఇచ్చేయడంతో మళ్లీ రౌడీ రైజింగ్ అవ్వబోతున్నాడని ఫ్యాన్స్ ఖుషీ అవుతున్నారు.

**కృతి శెట్టి గ్రేస్ మరియు గ్లామర్ యొక్క విజన్**



Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers, Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 1-17-1, Badeti Ramana Street, Near Mla House, 30th Word, Thadepalligudem , Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2834, E-Mail : Editorpenpower@Gmail.Com, Mobile: 9059465965